చిలమకూరు పనులపై విచారణ జరిపించండి

కలెక్టర్‌కు ఎంపీటీసీ వినతి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల మండల పరిధిలోని చిలమకూరు గ్రామంలో రూ.కోటి వెచ్చించి చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానిక ఎంపీటీసీ సభ్యులు నవీన్‌కుమార్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన శనివారం కలెక్టర్ విజయరామరాజును కలిసి ఓ వినతిపత్రం అందజేశారు. అభివృద్ధి పనుల పేరిట ప్రజాధనం ఇక్కడ పెద్ద మొత్తంలో దుర్వినియోగం అయిందని ఇందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని ఆ వినతిపత్రంలో వివరించారు. మండల స్థాయి అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేదని గుర్తుచేశారు. గ్రామంలో కాలువలు, సిమెంటు రోడ్లు, ఇతరత్రా అభివృద్ధి పనులను చేపట్టి పూర్తి చేసినట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారే తప్ప వాస్తవానికి పనులు చేయకుండానే ఎంబుక్కుల్లో నమోదు చేసుకొని బిల్లులు మంజూరు చేసుకోవడం జరిగిందని ఆయన ఆ వినతిపత్రంలో ఆరోపించారు. తాను ఇది వరకే ఈ అంశాన్ని పత్రికా ముఖంగా బహిర్గతం చేసినప్పటికీ సదరు అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. గ్రామంలోని పంచాయతీకి సంబంధించిన మినరల్ వాటర్ ప్లాంటును ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అప్పటి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటు ప్రైవేటుపరం అయిందన్నారు. మినరల్ వాటర్ ప్లాంటు అంశంపై కూడా ఎంపీడీవో, ఎంఆర్‌ఓలతో క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని ఆయన కోరారు.

మ్యూజియం పేరు మార్పు చేయడం దురదృష్టకరం: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: దేశ రాజధాని న్యూఢిల్లీలోని తీన్‌మూర్తి భవనంలో ఉన్న నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, అలాగే లైబ్రరీ పేర్లు మార్చాలని ప్రధాని మోదీ నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరమని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి తప్పుపట్టారు. వేంపల్లె కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలోని తీన్‌మూర్తి భవనంలో నెహ్రూ అధికారిక నివాసం నెహ్రూ మరణానంతరం 1964 నవంబరు 14వ తేదీన ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని మ్యూజియం, లైబ్రరీని నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించారన్నారు. గత 59సంవత్సరాలుగా ఇదే పేరుతో కొనసాగుతోందన్నారు. ఇప్పుడు పేరు మార్చాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. నవభారత నిర్మాత, ఆధునిక భారత రూపశిల్పి భారత తొలి ప్రధాని స్వర్గీయ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరుప్రతిష్టలను తగ్గించాన్న దురుద్దేశం బిజెపి ప్రభుత్వంలో కన్పిస్తుందన్నారు. గతంలో నెహ్రూ ప్రారంభించిన ప్రణాళికా సంఘాన్ని కూడా మోదీ ప్రభుత్వ రద్దు చేసిన విషయాన్ని తులసిరెడ్డి గుర్తుచేశారు.బిజెపి అభద్రతా స్వభావానికి అల్పబుద్ధికి, సంకుచితత్వానికి ఇదో నిదర్శనమన్నారు. ఆశాకంపై ఉమ్మేస్తే అది తిరిగి వారిముఖంమీదే పడుతుందన్నారు. ఇప్పటికైనా నెహ్రూ పేరిట ఏర్పాటు చేసిన మ్యూజియం, లైబ్రరీని పేర్లు మార్చాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన కాంగ్రెస్‌పార్టీ తరుపున డిమాండ్ చేశారు.

పెద్దచెప్పలి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా శివ కోటేశ్వర్ రెడ్డి

విశాలాంధ్ర - కమలాపురం : మండల పరిధిలోని పెద్ద చెప్పలి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా కె. శివ కోటేశ్వర్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు గతంలో పనిచేస్తున్న బ్యాంక్ మేనేజర్ కిషోర్ ఇతర బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పెద్ద చెప్పాలి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కే. శివ కోటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రిజర్వేషన్ బ్యాంక్ 2020 సంవత్సరంలో ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం అన్ని బ్యాంకులలో రూ.50 వేలు పైబడిన చెల్లింపులు చేయుటకు చెక్కు వినియోగించినప్పుడు అధిక భద్రత కొరకు పి.పి.ఎస్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ కొరకు ట్రాక్టర్ పవర్ టిప్పర్ కొనుగోలుకు అతి తక్కువ వడ్డీ ఋణం అండ్ డోర్ ధరపై 85/శాతం వరకు (బ్యాంకు నిబంధనల ప్రకారం) ప్రగతి డాక్టర్ హాస్పిటల్ విస్తీర్ణ నిర్మాణం కొనుగోలు అధునాతన వైద్య పరికరాలు కొనుగోలు ల్యాబ్ ఏర్పాటు చేయుటకు అతి తక్కువ వడ్డీ కే ఋణాలు బ్యాంక్ అందిస్తుందని తెలిపారు క్రాప్ లోన్ రెన్యువల్ రైతులు సకాలంలో బ్యాంకు సహకరించాలని ఆయన తెలిపారు.

అన్నదానానికి స్ఫూర్తి చల్లా

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: అన్నదానానికి స్ఫూర్తి ప్రదాత చల్లా రాజగోపాల్ అని పలువురు ఆన్నార్దులు కొనిఆడారు. పేదలకు కడుపు నిండా అన్నం పెట్టాలన్న తల్లిదండ్రుల కోరిక నెరవేర్చాలన్న ఆశయంతో 15నెలలుగా ప్రతి వారం పేదల ఆకలి తీరుస్తున్నారు చల్లా రాజగోపాల్. చల్లా రాజగోపాల్‌ను ఆదర్శంగా తీసుకొని అనేక మంది పేదల ఆకలి తీర్చేందుకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం అన్వర్ థియేటర్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన అనంతరం చల్లా రాజగోపాల్ మాట్లాడుతూ పేదలకు రుచికరమైన భోజనం ఉచితంగా అందించాలని మా తండ్రి శివరామయ్య ఆశయాలను మా కుటుంబసభ్యుల సహకారంతో నేరవేస్తున్నామని తెలిపారు. పేదలకు రుచికరమైన భోజనాన్ని ప్రారంభించి 15నెలలు గడుస్తుందని అన్నారు. కడుపు నిండా రుచికరమైన భోజనం తిన్న ప్రతి ఒక్కరు అన్నదాత సుఖీభవ అంటూ దీవెనలు అందిస్తున్నారన్నారు. ప్రతి వారం పేదలకు అన్నదానం చేయడమే కాకుండా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నామని అలాగే పేద కుటుంబాలలోని వారికి ఏడాదికి 15మందికి సామూహిక వివాహాలు కుటుంబసభ్యుల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంఘం పట్టణ ఉపాధ్యక్షులు రామచంద్రరాజు, బీసీ సమైక్య కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు దేవానంద్, చల్లా రవిశంకర్, చింతల రాఘవేంద్రయాదవ్, మూగబోయిన శ్రీనివాస్‌యాదవ్, జయచంద్ర యాదవ్, సీతంపల్లె రమణ, ప్రసాద్, గంగాధర్ యాదవ్, ఈశ్వర్‌రెడ్డి, బంగిశివ, బాష, చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని గ్రామాల ప్రజలకు సేవ చేసే గ్రామ వాలంటీర్లు సచివాలయం సిబ్బందితో కలిసి మండల స్థాయి అధికారులు గ్రామాలలో ఇంటింటికి వెళ్లి జగనన్నా సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకోవాలని జూన్ 26వ తేది నుండి ప్రతి మండలంలోని గ్రామాల వారీగా ఇంటింటికి వెళ్లాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులకు ఆదేశించారు. అందులో భాగంగానే మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి, తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి వివిధ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వాలంటీర్ల ద్వారా చేరినాయా లేదా అనే విశయంపై ఆరా తీయాలని, ప్రస్తుతం విద్యార్థులు పాఠశాలలో, కళాశాలలో చేరే విధంగా విద్యార్థులకు క్యాస్ట్, ఇన్‌కం తహసీల్దార్, వీఆర్‌ఓలు విద్యార్థులకు అందచేయాలని ప్రభుత్వం జగనన్నా సురక్షిత మంచినీటి పథకాన్ని కూడ పరిశీలన చేపట్టాలని అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అధికారులు, సచివాలయం సిబ్బంది గ్రామీన ప్రాంతాల నుండి మండల స్థాయి వరకు ప్రతి ఇంటికి వెళ్లాలని అధికారులకు ఆదేశాలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలను అందచేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈ నాగజ్యోతి, వెలుగు సిబ్బంది, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం సభ్యులుగా చేరండి

విశాలాంధ్ర-సిద్దవటం : శాస్త్ర ప్రచార ఉద్యమంలో 35 సంవత్సరాల ప్రస్థానం గల జనవిజ్ఞాన వేదిక ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్ అనే నినాదంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ పనిచేస్తూ ఉందని సిద్దవటం మండల విద్యాధికారి శంకరయ్య తెలియజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 11వ పటాలములో సైన్స్ ఉపాధ్యాయులు మరియు జన విజ్ఞాన వేదిక నాయకులతో కలిసి ఆయన "శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరండి" అని గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకరయ్య ఉపాధ్యాయులు ప్రసాద్, సమీర్ భాష, షేక్ సిరాజుల్ల, రాజమ్మ, పరమేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వచ్చే రోగులను ఆప్యాయంగా వైద్యసేవలందించాలి

ఏపీ రీజనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

విశాలాంధ్ర-ఒంటిమిట్ట : ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక రోగిని వైద్య సిబ్బంది ప్రేమ, అనురాగం, ఆప్యాయతతో వైద్యసేవలందించాలని అప్పుడే వారికి సగం జబ్బు నయమవుతుందని ఏపీ రీజనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం ఒంటిమిట్ట మండలంలోని కోదండరామాలయాన్ని ఆయన దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం టీటీడీ అధికారులు ఘనస్వాగతం పలికి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి రీజనల్ డైరెక్టర్‌ను దుశ్శాలువతో గజమాలతో సన్మానించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. తనిఖీలో మందుల గదిని, ల్యాబ్‌ను, కాన్పుల గదిని, ఓపి రికార్డును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులపై కొందరు సిబ్బంది అసహ్యించుకుంటున్నారని ఇది తమ దృష్టికి వచ్చిందని ఇది మంచిపద్ధతి కాదని ఆయన అన్నారు. ఫీల్డుకు వెళ్లే వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని వారు ఎక్కడికి వెళుతున్నారో ఎక్కడ పనిచేస్తున్నారో మూమెంట్ రిజిస్టర్‌లో రాయాలని ప్రతి ఒక సిబ్బంది సమయపాలన పాటించాలని రాష్ట్రంలో రాబోయేది వర్షాకాలమని ఎవరికీ ఎలాంటి జబ్బులు రాకుండా చూడాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ శ్వేత, సీహెచ్‌ఎన్ నాగరాజు, సూపర్‌వైజర్ బాష, ఆశ కార్యకర్తలు లక్ష్మీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కళ్యాన్ ప్రజా ప్రయోజనాల గురించి మాట్లాడటం లేదు:రాచమల్లు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ చేపట్టే వారాహి యాత్రలో ప్రజా ప్రయోజనాల గురించి మాట్లాడటం లేదని కేవలం వైకాపా పార్టీ వారిని విమర్శలు చేసేందుకే వారాహి యాత్ర చేస్తున్నట్లు ఉందని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద రెడ్డి ఎద్దేవా చేశారు. మున్సిపల్ చైర్మెన్ ఛాంబర్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ 10రోజుల క్రితం నేను సీఎం అభ్యర్థిని అని మాట్లాడి 10రోజుల తర్వాత నేను ఎమ్మెల్యే అవుతానని అసెంబ్లీలో అడుగు పెడతానని ఎవరు అడ్డు వస్తారో చూస్తానని మాట్లాడటం చూస్తుంటే సినిమాలో డైలాగులు చెప్పినట్లు చెబితే ప్రజలు ఎవ్వరు నమ్మరన్నారు. చెంచలమైన మనస్థత్వం, స్థిరమైన అభిప్రాయం లేకుండా మాట్లాడితే ప్రజలు విస్వరించరన్నారు. జనసేన పార్టీ తరపున 175 సీట్లలో పోటీ పెట్టి గెలిచే సత్తా లేకనే చంద్రబాబుతో చేతులు కలిపి ఏ 15సీట్లకు పరిమితం అయ్యేదే తప్ప మరొకటి కాదన్నారు. రాష్ట్ర ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల అవగాహణ లేకుండా సీఎం అభ్యర్థిని కాను అని చెప్పిన పవన్‌కళ్యాన్‌ను చెప్పినప్పుడు పార్టీ అభిమానులు కార్యకర్తలను మీ కులానికి చెందిన ఓటర్లను నీరు గార్చడమేనని అన్నారు. ప్రొద్దుటూరులో పోటి చేయ్యి అసెంబ్లీలో అడుగుపెట్టకుండా ఇక్కడి ప్రజలు ఓడిస్తారని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ బి.లక్ష్మిదేవి, కౌన్సిలర్లు వరికూటి ఓబుల్‌రెడ్డి, కమాల్‌బాష తదితరులు పాల్గొన్నారు.

బెస్తల శంఖారావం పోరుబాట

బెస్తల సంక్షేమాన్ని గాలి కొదిలిన జగన్ సర్కార్

22న మత్స్య శాఖ కార్యాలయాల ముట్టడి:బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రాంప్రసాద్

విశాలాంధ్ర - చెన్నూరు : నాలుగు సంవత్సరాలుగా బెస్తల సమస్యలపై స్పందించకుండా వారిని ఆర్థికంగా కుంగ తీస్తున్న జగన్ సర్కారుపై ఈ నెల 22 వ తేదీ నుంచి దశల వారీగా పోరుబాట నిర్వహిస్తున్నామని బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాదగిరి రాంప్రసాద్ పేర్కొన్నారు. చెన్నూరు లోని బెస్ట్ అకానీలో బెస్తల ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయ మాటలతో మత్స్యకారులను నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి బెస్తలను అణగ తొక్కుతున్నారని ఆయన మండిపడ్డారు.శనివారం నాడు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం చెన్నూరు మండలం బెస్త కాలనీలోని రామాలయం గుడి వద్ద బెస్త సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు మల్లె సుబ్బయ్య, బెస్త సాధికార కమిటీ కడప జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు ఏర్పాటు చేసిన బెస్త కుల సమావేశంలో వారు మాట్లాడారు.గత ప్రభుత్వం మత్స్య సహకార సంఘాల సభ్యుల సంక్షేమానికి సబ్సిడీతో కూడిన పనిముట్లు, పతి చెరువుకు ఉచిత చేప పిల్లల పంపిణీ, పట్టిన చేపలను విక్రయించుకునేందుకు టూ వీలర్స్, ఫోర్ వీలర్స్, త్రీ వీలర్స్ ఇలా అనేక పథకాలను మంజూరు చేసిందని అన్నారు. కాగా జగన్ ప్రభుత్వం నాలుగు సంవత్సరాలుగా మత్స్య సహకార సంఘాల సభ్యుల సంక్షేమానికి ఎటువంటి సహాయ సహకారాలు అందించలేదని పేర్కొన్నారు.కనీసం పనిముట్లు కూడా అందించలేని దౌర్భాగ్య స్థితికి చేర్చిందని, కులవృత్తి ద్వారా జీవనం సాగించే మత్స్యకారులైన బెస్తలపై జగన్ ప్రభుత్వం కక్ష్య కట్టిందని మండి పడ్డారు. "బెస్తల శంఖారావం" పేరుతో బెస్త కుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 22వ తేదీ నుంచి ఆందోళనలను తీవ్రతరం చేసేందుకు పోరుబాట పట్టనున్నామన్నారు. అయినా స్పందించకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై దండయాత్ర చేస్తామని హెచ్చరించారు. అనంతరం బెస్త కాలనీలో ఇంటింటికీ బెస్త నేతలు వెళ్ళి గత తెలుగుదేశం పార్టీ హయాంలో బెస్తలకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ నాడు - నేడు అనే కరపత్రాన్ని బెస్త కుటుంబ సభ్యులకు ఇచ్చారు. బెస్తలు అన్ని రకాలుగా అభివృద్ధిలోకి రావాలంటే మళ్ళీ నారా చంద్రబాబునాయుడు గారిని ముఖ్యమంత్రిని చేసుకుంటే తప్ప మనకు భవిష్యత్ లేదనే విషయాన్ని బెస్త నేతలు వివరించారు. ఈ కార్యక్రమంలో బెస్త సాధికార కమిటీ రాష్ట్ర సభ్యులు మానా చంద్రశేఖర్, టీడీపీ బెస్త నాయకులు గగ్గెర బాల గురవయ్య, పోలి సాయి,మామిల్ల వెంకట కృష్ణయ్య, శ్రీపతి శ్రీనివాసులు, చింతకాయల రంగ ప్రసాద్, మల్లె చిన్న వెంకట సుబ్బయ్య, గుడి నిత్య పూజ, చామంచి శ్రీను తదితర బెస్త నేతలు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలి: పుత్తా నరసింహారెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : యువకుల్లో దాగివున్న క్రీడల పట్ల ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందు కే క్రీడాపోటీలు ఏర్పాటు చేసినట్లు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని పుత్త ఎస్టేట్లో వాలీబాల్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణాష్టమి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు కృష్ణ చైతన్య రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మూడు రోజులపాటు ఆటలు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు రాబోయే రోజుల్లో నారా లోకేష్ కడప జిల్లా కు స్పోర్ట్స్ యూనివర్సిటీ తీసుకొస్తామని హామీ ఇచ్చారని తెలిపారు కడప జిల్లాలో క్రీడలను మరింత ప్రోత్సహించేందుకే ఇటువంటి క్రీడాక లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పుట్టినరోజు సందర్భంగా ఈ మూడు రోజులు క్రికెట్, కబడి, వాలీబాల్, టోర్నమెంట్ ఈ పోటీలలో పాల్గొంటున్నారని తెలిపారు అందరూ తమలో దాగివున్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీయాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే కడప ను క్రీడా హబ్ గా మార్చి రాష్ట్రస్థాయి పోటీలు ఇక్కడి నుంచి జరిగేందుకు కృషి చేస్తామన్నారు. క్రీడలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి 50,000 రెండో బహుమతి 25 వేల రూపాయలు అందజేయనున్నట్లు తెలిపారు.

కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయి

ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పోరుమామిల్లలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్ రెడ్డి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, బద్వేల్ యూత్ లీడర్ చిత్తా గిరిప్రణీత్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ స్కూల్‌లకు దీటుగా పోటీపడుతూ అత్యుత్తమ మార్కులు సాధించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. సీఎం జగన్ పేద విద్యార్థినీ విద్యార్థులకు అందరికీ జగనన్న విద్యా కానుక క్రింద 3జతల యూనిఫామ్, టెక్స్ట్ బుక్స్,నోట్ బుక్స్, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, పిక్టోరియల్ డిక్షనరి, స్కూల్ బ్యాగ్, ఒక జత షూస్, సాక్సులు ఇచ్చారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరికీ అమ్మఒడి క్రింద 10000 వేల రూపాయలు ఇస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో ఎన్నో మార్పులు చేశారు. వారంలో ఆరు రోజులు ఆరు రకాల భోజనం అందిస్తున్నారు. భోజనంతో పాటు 5 రోజుల పాటు కోడి గ్రుడ్డు, 3 రోజుల పాటు రాగిజావా, 3 రోజులు చిక్కీ అందిస్తున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే బాగా చదవగలరని చెప్పారు. జగనన్న ఆణిముత్యాలు పథకం క్రింద పాఠశాల స్థాయిలో ప్రభుత్వము ప్రకటించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు వరుసగ 3000,2000,1000 విద్యార్థులకు ఇవ్వటమే కాకుండా ప్రతాపరెడ్డి స్వంతంగా 2000,1000,1000 విద్యార్థులకు అదనంగా బహుమతిగా ఇవ్వడం జరిగింది. సర్పంచ్ రవిప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను జగన్ తీర్చిదద్దుతున్నారు. ఈ సారి పదవ తరగతిలో జిల్లా ఫస్ట్ రావాలని విద్యార్థులుకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ శివ ప్రసాదు, ఉపాధ్యాయ ఉపాధ్యాయునులు, విద్యార్థుల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

3న రాయలసీమ శంఖారావం: డాక్టర్ కుంచం

విశాలాంధ్ర-కడప: వచ్చేనెల 3వ తేదీన అనంతపురం నగరంలోని ఏపీఎన్‌జీవో భవనం నందు రాయల సీమ శంఖారావం కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. పులివెందులలో ఆయన మాట్లాడుతూ తరతరాలుగా రాయలసీమకు జరిగే అన్యాయాలను వెలుగెత్తి చాటేందుకు ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలను ప్రారంభించామన్నారు. రెండు ప్రధానమైన డిమాండ్లతో కార్యక్రమం చేపట్టామన్నారు. మొదటి ప్రాధాన్యత ప్రత్యేక రాయలసీమ లేదా రాయలసీమను కేంద్రపాలి ప్రాంతంగా ప్రకటించడం రెండో ప్రాధాన్యతగా చేపట్టామన్నారు. కడప.చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, తమిళనాడులోని రాయల వేలూరు, కర్నాకట రాష్ట్రంలోని చిత్రదుర్గ, కోలార్ కలిపి 12జిల్లాలతో కూడిన ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలన్నదే తమ తొలి డిమాండ్ అన్నారు. నాటి యుపిఏ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్లనే రాష్ట్రం రెండు ముక్కలైందన్నారు. ఒకప్పటి రాయలేలిన రతనాల సీమ నేడు పాలకుల అసమర్థ విధనాల వల్ల రాళ్లసీమగా మారుతుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. తరరాలుగా సీమకు అన్యాయం జరుగుతుంటే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భావితరాల వారు మనలను క్షమించరన్నారు. మనకున్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుని రాయలసీమను అంచెలంచెలుగా తీర్చిదిద్దుకునే అవకాశం మనచేతుల్లోనే ఉందన్నారు. కానీ ప్రభుత్వాలు, పాలకులు మారినా సీమ తలరాతలు మారలేదన్నారు. అందుకే తాను దశాబ్దాల తరబడి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం కోసం అలుపెరగని ఉద్యమాలు చేస్తున్నాని తెలిపారు. నేటి సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని, అలాగే సీమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వచ్చేనెల 3వ తేదీన తలపెట్టిన రాయలసీమ శంఖారావం కార్యక్రమానికి విశేష సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు.

ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-కడప: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఏపీఎస్‌ఎస్‌డిసి వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా,ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పిఎమ్‌కెవివై ఉచితంగా నిర్వహించే 60 రోజుల శిక్షణ కార్యక్రమానికి ధరకాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నాక్ అసిస్టెంటు డైరెక్టరు రాకేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉచిత శిక్షణతో ఉపాధి కల్పన - రెండునెలల పాటు 2 నెలల ఉచితంగా శిక్షణ ఇస్తారన్నారు. డైకిన్ ఏసీ కంపెనీ ద్వారా ఏసీ మెకానిక్ మరియు శానీ హెవీ మెషినరీ ద్వారా జెసిబి ఆపరేటర్ శిక్షణ ఇస్తారని తెలిపారు. 60 రోజుల ఉచిత శిక్షణా కార్యక్రమంలో హాజరైనా వారికి శిక్షణకు స్టేషనరి (పెన్ మరియు బుక్)ఉచితంగా అందజేయడంతో పాటు కార్యక్రమం లో క్వాలిఫైడ్ సిబ్బంది ఆధ్వర్యంలో శిక్షణ, సర్టిఫికెట్స్ అందజేస్తామన్నారు. ఈ కోర్సులకు పైన తెలిపిన కంపెనీల ద్వారా శిక్షణ ఇచ్చి రాష్ట్రంలోని పలు మల్టీ నేషనల్ కంపెనీల యందు ఉపాధి కల్పించడం జరుగుతుందని, అర్హత కలిగిన ఆసక్తి గల యువతీ యువకులు ఈ తరగతులను వినియోగించుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9000517637 నంబర్ నందు సంప్రదించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

ఘనంగా హాస్టల్ డే

విశాలాంధ్ర-కడప: పులివెందుల ఆహారవిజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాలలో శుక్రవారం హాస్టల్‌డేని ఘనంగా నిర్వహించారు. పులివెందుల పట్టణంలో ఫుడ్‌టెక్నాలజీ కళాశాలలో అన్ని రకాల మౌళిక వసతులు ఉండటం పట్ల ముఖ్య అతిథిలుగా విచ్చేసిన వక్తలు సంతృప్తిని వ్యక్తంచేశారు. హాస్టల్‌లో మెలగాల్సిన పద్ధతులు తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బెంగళూరు సఫల్ మార్కెట్ యూనిట్ అధ్యక్షులు ఎమ్ నిజగుణ, డాక్టరు మణి నజ్మా, ఏడుకొండలు, జయమ్మ, రాజేష్, నివేదిత, పావనదీప్తి, సాయిశ్రీనివాస్, రామిరెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చేప్పలి ఆరోగ్య కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర - కమలాపురం : మండల పరిధిలోని పెద్ద చెప్పాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ ఖాదర్ వలీ శనివారం అకస్మాత్తుకంగా తనిఖీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందున ప్రసూతి వార్డులో ల్యాబ్ రిటరి వార్డ్ టీకాలు నిలువ ఉంచుకున్న గదిని తనిఖీ చేశారు. అంతకుముందే మందు బిల్లలు సంబంధిత రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. కోగటం ఉపకేంద్రం పరిశీలనలో భాగంగా వ్యాధి నిరోధిక టీకాలు కార్యక్రమాన్ని పరిరక్షించి ప్రతి బిడ్డకు ప్రతి గర్భవతికి టీకాలు తప్పనిసరిగా సరైన సమయంలో అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని పి జాబిల్లి ప్రసన్న పి లలితమ్మ. బివి నరసింహారెడ్డి ప్రసాదు ఏఎస్‌ఎం పాల్గొన్నారు.

104 సేవలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - వల్లూరు : ప్రభుత్వం అందించే 104 సేవలు గ్రామ ప్రజలు సద్విని యోగం చేసుకో వాలని అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని చెరువు కింద పల్లి గ్రామంలో 104 సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సేవలు తప్పకుండా గర్భిణీలు, బాలింతలు, షుగర్, రక్తపోటు, టీవీ అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణీలు పౌష్టికాహారం అందించడం కాన్పులు ప్రభుత్వం ఆసుపత్రి తరలించే చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని గ్రామాల్లో లాప్రోస్ సర్వే నిర్వహించి పోడలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పనింద్ర, ఏఎన్ఎంలు 104 సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజి సమస్యను పరిష్కరించిన సర్పంచ్

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : పట్టణంలోని మేజర్ పంచాయితీ పరిధిలో నూతనంగా నిర్మించిన డ్రైనేజి కాలువ ఎత్తు ఉండటంతో చెడు నీరు ఉద్దికట్ట వీధిలోని రసూల్ అనే వ్యక్తి ఇంటి వద్ద నిలిచి దుర్వాసన వస్తూ ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న పోరుమామిళ్ల మేజర్ పంచాయితీ సర్పంచ్ యనమల సుధాకర్ సేఫ్టిక్ ట్యాంక్ ద్వారా చెడు నీటిని తొలగించి ఆ సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా డ్రైనేజీ కాలువ నిర్మించిన కాలువ ఎత్తులు తగ్గులు ఉండడంతో చెడు నీరు మొత్తం బయటకు వచ్చి ప్రజల ఇంటివద్ద నిలువ అయి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉద్దికట్ట వీధిలో జరుగుతుందని ప్రస్తుతం సేఫ్టీ ట్యాంక్ ద్వారా సమస్యను పరిష్కరించాం మరల ఈ సమస్య రాకుండా డ్రైనేజీ కాలువ ఎత్తు ఉన్నచోట సరైన రీతిలో మరమ్మతులు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగనివ్వకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన అన్నారు.

తమ భూమిని మరొకరికి విక్రయించారని

బాధితులు ఆవేదన

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : నాగలకుంట్ల గ్రామానికి చెందిన చెన్నుబోయిన పెద్ద వెంకటయ్య తల్లి అంకమ్మకు అక్కల రెడ్డిపల్లి రెవిన్యూ పొలంలో సర్వేనెంబర్ 1705-3 లో1ఎకరా15 సెంట్లు భూమిని ఇచ్చారని. ఆ భూమిని కలసపాడు మండలం ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిట్టి బోయిన గంగరాజు చౌరవ తో మూరబోయిన అంకయ్య వారసులు తమకు తెలియకుండా రాజంపేట నియోజకవర్గం చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి సాహెబ్ మహమ్మద్ కు విక్రయించారని బాధితులు పెద్ద వెంకటయ్య. భార్య నారమ్మ కుమారులు శ్రీనివాసులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ తమ తల్లి అంకమ్మకు1935 వ సంవత్సరంలో పసుపు కుంకుమ ద్వారా1 ఎకర15 సెంట్లు భూమిని తమ పుట్టింటి వారు ఇచ్చారన్నారు. ఆ భూమిలో వ్యవసాయ బోర్లు. విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకొని దాదాపు60 సంవత్సరాల నుండి పంటలు వేసుకుని జీవనం సాగిస్తున్నామని వారు ఆరోపించారు. ఇటీవల తమకు తెలియకుండా తమ బావ మూరబోయిన అంకయ్య వారసులు పసుపు కుంకుమ కు ఇచ్చిన భూమిని ఆన్లైన్ చేయించుకొని తమదే భూమి అంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారికి రిజిస్ట్రేషన్ చేసి విక్రయించారని వారు వాపోయారు. అదేవిధంగా భూమికి వేసిన కంచెను దౌర్జన్యంగా డోజర్ తో పగలగొట్టి తమకు నష్టం కలిగించారని వారు. ఆరోపించారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు సైతం పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని. కానీ ఎవరు పట్టించుకోలేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక ప్రదర్శనలు

విశాలాంధ్ర-కడప: పులివెందుల పట్టణ పరిధిలోని శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు పరిపాలనాధికారి సుధాకర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం 5.40 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు ఎస్ఆర్ డ్యాన్స్ స్కూల్ మాష్టర్ శబరీష్ ఆధ్వర్యంలో క్లాసికల్, జానపదం, వెస్ట్రన్ మొదలగు నృత్య ప్రదర్శనలు ప్రదర్శిస్తారన్నారు. అలాగే ఎస్. కె ఫిల్మ్ డ్యాన్స్ స్టూడియో యూట్యూబ్ ఛానల్ లో ఖుషి మూవీ నుంచి నా రోజా నువ్వే కవర్ సాంగ్ రిలీజ్ ఈవెంట్ ను పులివెందుల మహేష్ హరిలు నటించిన సాంగ్ ను రిలీజ్ చేస్తారన్నారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదరు కార్యక్రమమును జయప్రదం చేయవలసినదిగా ఆయన కోరారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా

ఔట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి:ఏఐటీయుసీ
19న జిల్లా వ్యాప్తంగా ఆందోళన

విశాలాంధ్ర-కడప రూరల్ : ఔట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికులను ఆప్కోస్ నుంచి మినహాయించి పర్మనెంట్ చేయాలని జూన్ 19న జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి తెలిపారు. శనివారం హెూచిమిన్ భవన్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మనెంట్ చేస్తామని మాట మార్చి అప్కోస్ ఏర్పాటు చేసి సంవత్సరాలు కావస్తున్నా నేటికీ వేతనాలు పెరగకపోగా, కార్మికుల వేతనాల నుంచి కటింగ్ చేసిన పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు సైతం కార్మికుల ఖాతాల్లో సరిగా జమ కాలేదన్నారు. 2014 సంవత్సరం నాటికి 5సంవత్సరాలు పూర్తి చేసిన కేవలం కాంట్రాక్టు కార్మికులను మాత్రమే వేల సంఖ్యలో ఉన్న వారిని పర్మనెంట్ చేసి లక్షలాదిమందిగా ఉన్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని విస్మరించి ప్రచారం చేసుకోవడం విడ్డురంగా ఉందన్నారు. ఇంజనీరింగ్ విభాగంలోని కార్మికులకు, స్కూల్స్ స్విపర్లకు గత నాలుగు సంవత్సరాలుగా వేతనాలు పెరగగా చాలీచాలని వేతనాలు మరోపక్క నిత్యావసర వస్తువులు ఆకాశాన్నంటుతున్న మరింత కుటుంబ భారం అవుతుందని తక్షణం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కెసి.బాదుల్లా, నగర అధ్యక్ష,కార్యదర్శిలు నర్సింహులు, తారకరామారావు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి లు పాల్గొన్నారు.

పారా మెడికల్ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి
ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగుజ్జుల వలరాజు డిమాండ్

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ఉన్న గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ (రిమ్స్) నందు శనివారం పారా మెడికల్ చదువుతున్న విద్యార్థులకు హాస్టల్లో వసతి కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి వలరాజు విద్యార్థులతో కలిసి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప రిమ్స్ నందు పారామెడికల్ డీఎంఎల్టి, డీఎంఐటీ, డీఆర్జీఏ డీఎం ఎస్టీ తదితర కోర్సులు నందు మొదటి సంవత్సరం అలాగే రెండవ సంవత్సరం విద్యార్థులు రాయలసీమ జిల్లాలను వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది విద్యార్థులు రిమ్స్ నందు చదువుకుంటున్నారు అయితే హాస్టల్ వసతి లేకపోవడం చాలా బాధాకరమని విద్యార్థులు అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నారని నగరంలోని ప్రైవేట్ హాస్టళ్లకు వేలాది రూపాయల కట్టలేక ఇబ్బందుల గురవుతున్నారని అన్నారు. అధికారుల, అధికార పార్టీ రాజకీయ నాయకులు మాత్రం ఆఘమేగలపై భవనాలు ప్రభుత్వం కల్పిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల పారా మెడికల్ విద్యార్థులను చిన్నచూపు చూడొద్దని వైద్యాధికారులు గుర్తించి రిమ్స్ నందు ప్రత్యేక వసతి గృహం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి కే శివశంకర్, నగర అధ్యక్షులు బి అరుణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట్‌లో చైతన్య పూర్వపు విద్యార్థి ప్రతిభ

విశాలాంధ్ర-వేంపల్లె: నీట్ పరీక్షల్లో వేంపల్లె శ్రీచైతన్య పాఠశాలకు చెందిన పూర్వపు విద్యార్థి చంద్రాయుడు ప్రతిభ సాధించారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల పూర్వపు విద్యార్థి ఇండియా పరిధిలో 247 వ ర్యాంక్, ఆల్ ఇండియాలో 2884వ ర్యాంక్ సాధించాడన్నారు. స్టేట్ 53వ ర్యాంక్ సాధించాడని.విద్యార్థి ప్రతిభకు పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి, డైరెక్టరు చైతన్య రెడ్డిఉపాధ్యాయులు విద్యార్థినీ అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

విశాలాంధ్ర - వల్లూరు : విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. శనివారం కడప కలెక్టరేట్లో వల్లూరు ఏపీ మోడల్ కాలేజీలో ఇంటర్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని మేకల రేణు శ్రీకి జగనన్న ఆణిముత్యాలు పేరుతో కడప కలెక్టర్ విజయరామరాజు, కమలాపురం నియోజవర్గం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అవార్డు ను 50వేల రూపాయలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పాఠశాలకు నాడు నేడు కార్యక్రమంలో

ద్వారా ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ హంగులు తీసుకొచ్చామన్నారు. విద్యార్థులు ఎదగాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. చదువుతోపాటు ఆటపాటలు అవసరమన్నారు. మోడల్స్ స్కూల్ ప్రిన్సిపల్ సురేష్ బాబును కలెక్టర్, ఎమ్మెల్యే అభినందించారు.

సిస్టోబాల్ ప్రపంచ కప్‌లో రన్నర్‌గా నిలిచిన
కేఎస్ఆర్ఎం కళాశాల ఫిజికల్ డైరెక్టర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మే 21 వ తేదీ నుండి 25 వ తేదీ వరకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నార్త్ బెంగళూరులో సిస్టోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఏషియన్ సిస్టోబాల్ ఫెడరేషన్, అంతర్జాతయ సిస్టోబాల్ అసోసియేషన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించగా ముందుగా సిస్టో బాల్ ఇండియా టీమ్‌కి కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వంశీ నాయక్ ఎంపికై, అనంతరం మొట్ట మొదటి సారిగా మే 21-25 వ తేదీ లలో బెంగళూరులో జరిగిన మొదటి సిస్టోబాల్ ప్రపంచ కప్ -2023లో ఇండియా తరపున ఆడి రన్నర్‌గా నిలిచాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), ప్రధానచార్యులు డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, కళాశాల సిబ్బంది రన్నర్ గా నిలిచిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వంశీ నాయక్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

రీజనల్ డైరెక్టర్ పరిధిలో సాధారణ బదిలీలు

విశాలాంధ్ర-కడప : ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం పరిధిలో సాధారణ బదిలీలు జరుగ నున్నాయి. ఈనెల 20 నుంచి బదిలీల ప్రక్రియ మొదలవుతుందని రీజనల్ డైరెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. స్టాఫ్ నర్స్ లు, హెడ్ నర్సులు, సిస్టర్ ట్యూటర్స్, పీఎంఓ ,ఫార్మసిస్ట్ గ్రేడ్ 2, ఫార్మసీ సూపర్వైజర్స్, ఫార్మసిస్ట్ గ్రేడ్ వన్ ,డిపిఎమ్ఓ, హెల్త్ ఎడిటర్స్ ,పిహెచ్ఎన్ ఎమ్ ,పి హెచ్ ఎస్ ఎం ,పి హెచ్ ఎస్ మేల్ ,ఎం పి హెచ్ ఈ ఓ, రేడియోగ్రాఫర్స్ ,రేడియాలజిస్ట్,ఏ ఎస్ ఓ ,డై ఎస్ ఓ,డై డి ఈ ఎం ఓ బదిలీలు జరుగు నున్నాయి.ఈ మేరకు ఆఫీస్ సూపరింటెండెంట్ సాధారణ బదిలీల ప్రక్రియ జూన్ నెల 20వ తేదీ నుంచి 22 వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు.

జగనన్న ఆణిముత్యాలు అందుకున్న కేజీబీవీ విద్యార్థులు

విశాలాంధ్ర-కలసపాడు : కలసపాడు మండలం పెండ్లిమర్రి కేజీబీవీ నుండి ఇద్దరు విద్యార్థినీలు జిల్లాస్థాయి ఆణిముత్యాల అవార్డులు అందుకున్నారు.జిల్లా కలెక్టర్ విజయరామరాజు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, డీఈవో రాఘవరెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ఇంటర్ హెచ్ఈసీ విభాగం నుండి కేజీబీవీలలో ప్రథమ బహుమతిగా రూ.50,000లును బి.లక్ష్మీదేవి, పదవతరగతి నుండి జిల్లా తృతీయ స్థానం కె.కరుణ రూ.15,000 బహుమతి షీల్డును కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రెడ్డిజోతి, విద్యార్థినీల తల్లిదండ్రులతో కలిసి అందుకున్నారు. ఈ సందర్భంగా కేజీబీవీ ఎస్ఓమాట్లాడుతూ ఈ విజయానికి కారకులైన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు.

వర్షంకోసం ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - లింగాల : లింగాల మండలం ఎగువపల్లి గ్రామంలో వర్షంకోసం మూడు రోజులపాటు గ్రామస్తులు చింతల వెంకటరమణ స్వామికి ప్రత్యేక పూజలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షంకోసం మూడురోజులపాటు గ్రామంలో పూజలుచేసి అగ్నిహెూత్రం నిర్వహిస్తామని తెలిపారు.మూడవరోజు గ్రామసమీపనఉన్న కొండలో చింతల వెంకటరమణ స్వామి పాదాలు ఉన్న ప్రాంతంలో పూజలుచేసి అగ్నిహెూత్రం నిర్వహిస్తామని తెలిపారు. ఈవిదంగా పూజలు చేస్తే బాగా వర్షలు కురిసి పంటలు పండి గ్రామానికి మంచి జరుగుతుందని గ్రామస్తుల నమ్మకం.

రాష్ట్ర ప్రజలపై పెనుభారం కానున్న విద్యుత్ ట్రూఆఫ్ చార్జీలు:సిపిఐ

కేంద్ర ప్రభుత్వ విద్యుత్ ప్రవేటీకరణలో భాగమైన వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే విధానం విరమించుకోవాలి
రేపు విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు -జూన్ 20 నుండి 25 వరకు రౌండ్ టేబుల్ సమావేశాలు
దశల వారి పోరాటం - సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : రాష్ట్రంలో జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి ఎడా పెడా విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ ప్రవేటీకరణ బిల్లుకు మద్దతిచ్చి, షరతులను శరవేగంగా అమలు చేస్తూ విద్యుత్ సంస్థలను అప్పుల ఊబిలోకి నెట్టి కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టాలనే దుస్సాహసానికి ఒడిగట్టింది అని విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దశల వారి పోరాటానికి సమర్థమవుతున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల జగన్మోహన్రెడ్డి అధికారంలోకి వస్తే 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు రానున్న కాలంలో కూడా పెంచబోమని నమ్మబలికి అధికారాన్ని చేపట్టిన తరువాత 7సార్లు కరెంటు చార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచారు. నాణ్యమైన విద్యుత్ నిరాటంకంగా అందిస్తానని చెప్పి నేడు నిరంతరం కోతలు ప్రజలపై వాతలు వేస్తున్నారు. రాష్ట్రంలో 1కోటి 89 లక్షలమందికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి 13500కోట్లు వృధా ఖర్చులతో ప్రజలపై బాదుడుకు సిద్ధమైంది. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థలకు అవసరమైన సహకారం అందించి పటిష్టం చేయాల్సిన ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా నిర్వీర్యం చేస్తూ నష్టాల పేరుతో తన అనుచర కంపెనీలకు దోచిపెట్టేందుకు విధానాలు రూపకల్పన చేస్తున్నది. ఇటీవల ట్రూఆఫ్ చార్జీల పేరుతో దాదాపు 1350 కోట్లు ప్రజల నుండి రికవరీ చేయాలని ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ వద్ద అనుమతి తీసుకున్నారు. ఇవే కాకుండా ప్రభుత్వం తీసుకువచ్చిన సాంకేతికపరమైన మార్పుల వల్ల వినియోగదారులపై చార్జీల భారం పడుతున్నది. మీటర్లలో తలెత్తే సమస్యల వల్ల కూడా బిల్లులు వందల నుండి వేలకు, వేల నుండి లక్షలకు చార్జీలు పడితే వాటిని కూడా ప్రభుత్వం ముక్కుపిండి వసూలు చేస్తున్నది. జగన్‌మోహన్ రెడ్డి ఉచిత విద్యుత్ పథకానికి మంగళం పాడేందుకు రాష్ట్రంలో 17.72లక్షల వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్మీటర్లు బిగించేందుకు పూనుకున్నాడని ఆరోపించారు.

చీకటి ఒప్పందాల మాటున దోపిడీ

రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు అవసరమయిన ముడి సరుకుల్లో ముఖ్యమైనది. బొగ్గు సరఫరా మొదలు, స్మార్ట్మీటర్లు ఏర్పాటు, ట్రాన్స్ఫార్మర్ల కొనుగోలు వరకూ జగన్మోహన్రెడ్డి అనుచర కంపెనీలయిన అదాని, శిర్డీసాయి కంపెనీలతో మాత్రమే ఒప్పందాలు చేసుకుని బహిరంగ మార్కెట్ కంటే అధిక ధరకు కోడ్ చేసి తద్వారా ప్రజాధనాన్ని లూటీ చేయడం ద్వారా వచ్చిన కమీషన్లను కలిసి దోచుకుంటున్నారు. ఈనేపధ్యంలో నిత్యం ప్రజలు వినియోగించే విద్యుత్ చార్జీల పెంపు పర్యావసానం అన్ని రకాల వస్తువులు, రవాణా చార్జీలపై తీవ్ర ప్రభావం చూపి ధరలు మరింత పెరిగే ప్రమాధం ఏర్పడింది. ఇప్పటికే జీఎస్టి పన్నుల భారంతో తల్లడిల్లుతున్న ప్రజలకు చెత్తపన్ను, ఇంటిపన్ను, నీటిపన్నుతో పాటు విద్యుత్ చార్జీలు పెంచడం ప్రజలకు పెనుభారం కానున్నది. ప్రభుత్వం తక్షణం ట్రూఆఫ్ చార్జీలు, సర్చార్జీలు, సర్దుబాటు చార్జీలు రద్దు చేసి, ప్రీపెయిడ్ స్మార్టీమీటర్లు బిగించడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, కేసీబాదుల్ల పాల్గొన్నారు.

విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా పురస్కారాలు ప్రదానం
జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : విద్య అనేది పదిమందికి పంచగలమే కానీ ఏ ఒక్కరూ కూడా దొంగిలించలేని విలువైన ఆస్తి అని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లా స్థాయిలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు "జగనన్న ఆణిముత్యాలు" కార్యక్రమంలో భాగంగా ప్రతిభ పురాష్కారాల బహూకరణ జరిగింది. ఈ కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. వివిధ ప్రభుత్వ యాజమా న్యాలకు చెందిన విద్యా సంస్థల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ లలో అత్య ధిక మార్కుల సాధించిన విద్యార్థులను మరింత ప్రోత్సహించడం కోసం సరికొత్త ఆలోచనతో "జగనన్న ఆణిముత్యాలు" పేరుతో ప్రోత్సాహకాలు ఇవ్వడానికి నిర్ణయం నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ రోజు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభ అవార్డులను ఇవ్వడం జరిగిందని, రాష్ట్ర స్థాయిలో ఈ నెల 20వ తేదీన పురస్కారాలను అందివ్వడం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడానికి వినూత్న విద్యా సంస్కరణలు తీసుకువస్తున్న ముఖ్యమంత్రి విద్యార్థుల చదువుకు అవసరమయ్యే ఆర్థిక భరోసాను తల్లిదండ్రులకు అందివ్వడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్ర మంలో ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్, శాలువా జ్ఞాపికలు అందజేసి సత్కారంతో పాటు నగదు బహుమతిని అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వై. రాఘవరెడ్డి, ఆర్.ఐ.ఓ. రమణ రాజు, ఎస్ఎస్ఏ పీఓ డా.ప్రభాకర్ రెడ్డి, బీసీ వేల్ఫేర్ ఈడి డా.వి.బ్రహ్మయ్య, ఎస్సి కార్పొరేషన్ ఈడి డా. వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు బాలికల ఎంపిక

విశాలాంధ్ర - బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రం పరిధిలోనే స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 10వ తరగతి ఉత్తమ ఫలితాలు సాధించిన బాలికలకు నగదు రూపంగా మొదటి బహుమతి 3000 రూపాయలు రెండో బహుమతి 2000 రూపాయలు, మూడో బహుమతి, 1000 అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలుగా ఎంపిక చేసి విద్యార్థులను ఉత్సాహం పరచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఆదేశాలతో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్మల దేవి ఆధ్వర్యంలో బాలికల విద్య ద్వారా ప్రతి ఒక్కరినిను ప్రోత్సహించి ఉన్నంత చదువుకు ఆపై పై చదువుకు వెళ్లారు అన్నారు. 2022,23 సంవత్సరం 10వ తరగతి పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు అణి ముత్యాలగా ఎంపిక చేసి విద్యార్థులను ఉత్సాహం పరచాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రోత్సహించామన్నారు. విద్యార్థులను ఉత్సాహం పరచాలని విద్యార్థులు పోటీ తత్వం ఏర్పడి మంచి ఫలితాలు సాధిస్తారని పదో తరగతి నుండి ఇంటర్ వరకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు లెక్కల కొండారెడ్డి ఉపాధ్యాయులు, ప్రభాకర్, బాల గురవయ్య ఎలిజిబెత్ రాణి, అరుణ ఉమాదేవి పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నోషితకి వైవీయూ డాక్టరేట్

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధకురాలు మద్దిరేవుల నోషితకి విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సహ ఆచార్యులు డాక్టర్ జి.పార్వతి పర్యవేక్షణలో " ఇంపాక్ట్ అసెస్మెంట్ ఆఫ్ స్వచ్ఛ భారత్ మిషన్ విత్ రిఫరెన్స్ టు ఉమెన్ హెల్త్ అండ్ డిగ్నిటీ- కడప డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్" అనే అంశముపైన పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంథాన్ని మద్దిరేవుల నోషిత విశ్వ విద్యాలయ పరీక్షల విభాగానికి సమర్పించారు. వైవియు ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మార్గదర్శకం మేరకు నియమితులైన నిపుణుల బృందం, పరిశోధకుడు మద్దిరేవుల నోషిత రూపొందించిన పరిశోధన గ్రంథం అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉందంటూ ధృవీకరించారు. ఈ మేరకు నోషితకు డాక్టరేట్ ప్రొసీడింగ్స్ ను వై.వి.యు పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ నల్లపురెడ్డి ఈశ్వర్ రెడ్డి జారీ చేసారు. పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగములో డాక్టరేట్ అందుకున్న మద్దిరేవుల నోషితను ఉపకులపతి ఆచార్య చింత సుధాకర్, కుల సచీవులు ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ప్రధానాచార్యులు ఎస్. రఘునాథరెడ్డి, ఉప ప్రధానాచార్యులు ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సహ ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధక పండితులు, విద్యార్థులు అభినందించారు.

సెల్ టవర్‌ను నిలుపుదల చేయాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : మాకు, మా పిల్లలకు ఇబ్బందికరంగా మారబోతోన్న టవర్ నిర్మాణం జరగకుండా చూడాలని హరిజనులతో కలసి కార్పోరేషన్ కమీషనర్ కు చేసిన విన్నపాలు తుంగలో తొక్కి వైస్సార్సీపి నాయకులకు తలొగ్గి వారి ప్రక్కనే మాట్లాడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కడప నగర మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 50వ డివిజన్ రూకవారిపల్లి దగ్గర ఏర్పాటు చేయబోతున్న ఎయిర్ టెల్ టవర్ ను హరిజనులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓసి కాలనీ లో మంజూరు అయిన ఎయిర్ టెల్ టవర్ నిర్మాణంను అక్కడి వాసులు వ్యతిరేకించడంతో బలహీనులైన హరిజన కాలనీ దగ్గర ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఏదైనా ఒక టవర్ నిర్మాణం చేయాలంటే నగరంలో నగర కమీషనర్, ఎయిర్ పోర్ట్ అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. వీరు చేపట్టే నిర్మాణం ను గతంలో కమీషనర్ అడ్డుకొని భారీగా జరిమానా విధించారన్నారు. అయితే ప్రస్తుతం కొందరు అధికారుల అనుమతి అవసరం లేదు వైసీపీ అనుమతి ఉంటే చాలు అన్నట్లుగా నిర్మాణం చేస్తున్నారన్నారు. ఇది ఎయిర్ పోర్టుకు దగ్గరగా విమానం దిగేందుకు ఇబ్బందికరంగా ఉందన్నారు. ఇక్కడ రూల్స్ రెగ్యులరైజ్ గాని పనిచేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గన్నేపాటి మల్లేష్, యాటగిరి రాంప్రసాద్, గడ్డం శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి
వైసీపీ నాయకుడు అశోక్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 50వ డివిజన్ రూకవారిపల్లెలో సెల్ టవర్ ఏర్పాటుపై జరిగిన ఘర్షణలో గాయపడిన వైయస్సార్సీపి నాయకుడు అశోక్ కుమార్ రెడ్డిని రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు తనపట్ల దౌర్జన్యకరంగా వ్యవహరిస్తూ పాదరక్షలతో దాడి చేసేందుకు ప్రయత్నించారన్నారు. తనపై దాడిజరుగుతున్నదని తెలుసుకున్న తన సోదరుడు అడ్డుకోబోగా అతనిపై కూడా దాడి చేయడం జరిగిందన్నారు. తన స్థలాన్ని లీజుకు ఇచ్చిన కారణంగా తనను వివిధ కేసుల్లో ఇరికించడం కోసమే టీడీపీ వారి సహాయ సహకారాలతో ఈదాడి జరిగిందన్నారు. ఈ విషయంగా అధికారులు తనకు రక్షణ కల్పించడంతో పాటు దాడికి పాల్పడిన వారి బారి నుంచి కాపాడాలని,ఈ ఘటనలో కారకులను తగిన విధంగా శిక్షించాలని ఆయన కోరారు.

గౌస్ నగర్ కుటుంబాలను ఆదుకోండి
రాష్ట్ర మైనార్టీ హ్యూమన్ రైట్స్ అధ్యక్షులు షేక్ దస్తగిరి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఇక్కడ నివసిస్తున్న వారంతా కష్టపడితే గాని ఏ పూటకు, ఆ పూటకు గడవని నీరుపేద ప్రజలు తినే తినక రూపాయ కు రూపాయ పొగుచేసుకొని కొనుగోలు చేసుకొని ఇల్లులు కట్టుకున్న వారిపై అధికార పార్టీ నాయకులు కన్ను పడిందని రాష్ట్ర మైనార్టీ హ్యూమన్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు షేక్ దస్తగిరి అన్నారు. శనివారం ఈ సంద ర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్కడ ఉన్న ప్రజలు అష్టకష్టాలు పడి ఇల్లు లు కట్టుకొని 40 సంవత్సరాలుగా కాపురం చేసుకుంటున్న ఆకాలనీ పై ఓవ్యక్తి కన్ను పడింది.అంతే తన మెదడుకు పనిపెట్టి కబ్జాకు శ్రీకారం చుట్టి కమీష నర్ రంగంలోకి దింపి, స్మశానం. పేరుతో కూలగొట్టే ప్రయ త్నానికి శ్రీకారం చుట్టారు. అదెక్కడో చూద్దామా కడప నగరంలో గౌస్ నగర్.అక్కడ నలభై ఏళ్లుగా అన్ని వర్గాలకు చెందినవారు నివాసం ఉంటున్నారు. అంది మంచి విలువ కలిగి ఉండటంతో అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి కన్నుపడింది.తన పన్నాగం మొదట రాజకీయ నాయకులు, అమాత్యులు, అధికారుల ద్వారా వారి ఇల్లు కూలగొట్టేం దుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. వచ్చిన కలెక్టర్, కమిషనర్ లతో రకరకాల సర్వేలు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అక్కడి వాసులు వాపోతున్నారు .ప్రజలకు సేవలు చేయడానికి అధికారులు ఉన్నారా, ఒక వ్యక్తి కోసం పనిచేస్తు న్నారా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు వచ్చిన కమీషనర్ మాత్రం ఆయన అడుగు లకు మడుగులు వత్తుతూ పేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా దుష్ట ఆలోచన కు స్వస్తి పలికి పేదవారికి అండగా నిలవాలని కోరుతున్నారు.

కడప ఆకాశవాణి కేంద్రం సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : 1963 సంవత్సరం జూన్ 17 తారీఖున కడప నగరం ఆల్ ఇండియా రేడియో స్టేషన్ కేంద్రమును ఏర్పాటు చేసి నేటికీ 60 సంవత్సరాలు పూర్తి కావడం ఎంతో ప్రశంసనీయమని కడప సిటీ ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య అన్నారు. కడప నగరంలో ఉన్న ఏఐఆర్ ప్రసార కేంద్రం నందు లోగోను పూలమాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కోవిడ్ సమయంలో కూడా ఆల్ ఇండియా రేడియో ప్రసారాలు ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాయని అలాగే ప్రస్తుతం నువ్వుల హరివిల్లు వాట్సాప్ సినీ గీతాలు అలాగే ప్రతి శనివారం హిందీ తెలుగు ఇలా ఎన్నో గీతాలు ప్రసారం చేస్తూ ప్రజలను ఎంతో ఆకట్టుకుంటున్నా ఆల్ ఇండియా రేడియో అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాయల్ రషీద్ సంగం అధ్యక్షులు అబ్దుల్, రాయల్ కరిముల్లా, ఆకాశవాణి కేంద్ర కార్యాలయ అధికారులు భవాని ప్రసాద్, విజయవాణి, సుజన, పద్మ తదితరులు పాల్గొన్నారు.

చిలమకూరు పీహెచ్‌సీ అకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని చిలమకూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ శాంతికళ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె డెలివరీ గది, ల్యాబ్, అక్కడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆమె ఏఎన్ఎంలతో సమావేశమై జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పుల సంఖ్య పెంచాలని అలాగే గర్భవతులు, చిన్నపిల్లల సర్వే వివరాలను ఆర్సిహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎన్సిడి-సిడి సర్వేలో 80శాతం కన్నా తక్కువ నమోదు చేసిన ఏఎన్ఎంలపై చట్టపర చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు సురేష్మా, సీహెచ్ఓ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమవాసులకు అన్నదానం

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో ఉన్న మదర్‌థెరిసా ఆశ్రమంలో శనివారం ఆశ్రమ వాసులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్ రమణారెడ్డి కుమారుడు విష్ణు స్వరూప్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమవాసులకు భోజనంతో పాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమణారెడ్డి సతీమణి సౌజన్య, కుమారుడు విష్ణు కుమార్తె ధరణి, బయమ్మ ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్య తదితతరులు పాల్గొన్నారు.

రీ సర్వేను పక్కాగా చేపట్టాలి: తాసిల్దార్

విశాలాంధ్ర - చెన్నూరు : గ్రామాలలో చేపట్టే రీసర్వేణు పక్కాగా చేపట్టాలని, త్వరితగతిన పూర్తి చేయాలని తాసిల్దార్ సరస్వతి పేర్కొన్నారు. మండలంలోని ముండ్ల పల్లి గ్రామంలో శనివారం జరుగుతున్న రీసర్వేను ఆమె పరిశీలించారు. జరుగుతున్న సర్వే గురించి మండల సర్వేయర్ సోమశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాసిల్దార్ మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ రీసర్వే ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులకు ఉన్న చిన్న చిన్న భూ సమస్యలు తొలగిపోతాయన్నారు. ముండ్లపల్లి గ్రామ పొలంలో 812 సర్వే నెంబర్లు ఉన్నాయని, 853.63 ఎకరాల విస్తీర్ణం ఉన్నదని తెలిపారు. హద్దులు ఏర్పరిచి రైతులకు పాసుపుస్తకాలు ఇస్తారని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సుధీర్ కుమార్, సచివాలయ సర్వేయర్లు వెంకట శివారెడ్డి, తేజేంద్రనాథ్ రెడ్డి, రామచంద్రారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా జనసేన

విశాలాంధ్ర-సిద్దవటం : అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఊటుకూరు గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన అనిల్ కుమార్ అనే యువకులు,, కోడిదల తిరుపాలమ్మ అనే మహిళకు 42,000 వేల రూపాయలు ఎన్నారై జనసేన పార్టీ కువైట్ సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ యువ నాయకులు అతి కారి దినేష్ గాయపడ్డఅనిల్ కుమార్‌కు 10000/ రూపాయలు ఆర్థిక సహాయం చేశారు పత్రికాముఖంగా రాజంపేట నియోజకవర్గం జనసేన పార్టీ యువ నాయకులు అతికారి దినేష్ మాట్లాడుతూ ప్రమాదంలో గాయపడ్డ నిరుపేద కుటుంబాలకు జనసేన పార్టీ ఎన్ఆర్ఐ సభ్యులు ఆర్థికంగా వీరికి అండగా నిలబడడం చాలా సంతోషకరమని జన సైనికులు ఎప్పటికీ సామాజిక సేవలో నిలవడం చాలా సంతోషకరమని బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వారికి ఆర్థికంగా ఇంకా సహాయ కార్యక్రమం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కత్తి సుబ్బరాయుడు, కోలాటం హరి, పోలిశెట్టి శీను, కొండలగారి హరి, గుగ్గిల నాగార్జున, బెల్లంపల్లి శ్రీనివాసులు వీరయ్య, ఆచారి, హేమంత్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వాడకంపై అవగాహన



విశాలాంధ్ర-కడప : చింతకొమ్మ దీన్నే మండలం, సుబ్బన్న గారి పల్లె గ్రామం నందు మహిళలకు మరియు అక్కడ ప్రజలకు ఎల్పిజి గ్యాస్ వాడకముపై ప్రసాద్ గ్యాస్ ఏజెన్సీ కడప వారి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమము నందు గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రైటర్ తేజ మరియు బిందు అదేవిధంగా అగ్నిమాపక సిబ్బంది కుమారస్వామి, నూర్ భాషా, రాజశేఖరులు పాల్గొనడం జరిగినది.

NAME CHANGE

I MYSELF **NAZIYA SYED** HOLDING OF INDIAN PASSPORT NUMBER U0465194 RESIDENT IN 2 361 SASTRINAGAR AKKAYAPALLI KADAPA YSR DISTRCT THAT I HAVE CHANGED MY NAME NAZIYA SYED TO GIVEN NAME NAZIYA SURNAME SHAIK

విశాలాంధ్ర

అన్నమయ్య జిల్లా

విద్యతోనే సమాజాభివృద్ధి:ఎమ్మెల్యే నవాజ్ బాషా

విశాలాంధ్ర-రామసముద్రం: విద్యాభివృద్ధి తోనే సమాజం అభివృద్ధి చెందుతుందని మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ భాష తెలిపారు శనివారం రామసముద్రం మండలంలోని మినికి గ్రామంలో ని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో విద్యా కానుక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వపాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలు దీటుగా తీర్చిదిద్దుతున్నాడని కొనియాడారు. జగనన్న విద్యా కానుక అమ్మఒడి వంటి పథకాలతో పేద ప్రజల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని తెలిపారు. నూతనంగా ఆణిముత్యాలు ద్వారా మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు 21 మందికి మొదటి బహుమతిగా 3000 రెండవ మూడవ బహుమతిగా రెండు. వెయ్యి రూపాయలు విద్యార్థులకు నగదు అందించారు. నాడు నేడు పథకం ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలలకు నూతన వరుడి కి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఎస్టియు నాయకులు ఎమ్మెల్యే నవాజ్ ఘనంగా సత్కరించారు భాషను కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి జడ్పిటిసి రామచంద్రారెడ్డి తహసిల్దార్ దైవరాజన్ ఎంఈఓ హేమలత హేమలత సింగల్ విండో అధ్యక్షుడు కేశవరెడ్డి వైస్ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి గంగాధర్ నాయుడు మాజీ సింగల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి కన్వీనర్ భాస్కర్ గౌడ్ ఎంపిటిసి శైలజ నందకుమార్ రెడ్డి రాధారెడ్డి గెవన్న సుబ్బారెడ్డి దొడ్డిపల్లి ఆనంద ప్రిన్సిపాల్ మునుస్వామి నాయక్ ఉపాధ్యాయుల మురళి ఐయూబ్ ఖాన్ శంకర్ అనిల్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి:జిల్లారైతు సంఘం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఉద్యాన పంటలు పండించే మామిడి పంటకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం నాయకులు మలిశెట్టి జితిన్ డిమాండ్ చేశారు. శనివారం తమ కార్యాలయం వద్ద పాత్రికేయులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా జితిన్ మాట్లాడుతూ పంట చేతికి వచ్చే సమయానికి వ్యాపారులు దళారులు కుమ్మక్కై రేటు లేకుండా చేసి రైతులను పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దళారీల వలన రైతులు నిలువునా మోసపోతున్నారన్నారు. ప్రకృతి దెబ్బ ఒకవైపు, దళారి వ్యాపారుల దెబ్బ మరోవైపు, అధికారుల ఉదాసీనత ఇన్ని రకాలుగా దెబ్బ మీద దెబ్బ పడుతుంటే రైతులు తట్టుకోగలరా తట్టుకొని వ్యవసాయం చేయగలరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత సరిగా లేదని వ్యాపారులు దళారులు సగానికంటే సగం ధరలు తగ్గించి ధరలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఉద్యాన పంటల రైతులు దళారీల నుండి దోపిడీకి గురవుతుంటే మార్కెటింగ్ శాఖ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ప్రతి సంవత్సరం లక్షల్లో నష్ట పోతున్నారన్నారు. దుష్ట దుర్మార్గపు వ్యాపారుల దళారి దోపిడీకి చరమగీతం పాడి అహర్నిశలు కష్టపడి సమాజానికి ఇంత బువ్వ పెడుతున్న అన్నదాతను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ అధికారులు దళారీల వ్యాపారుల వ్యవహారంపై నిఘా ఉంచి ఉద్యాన పంటల రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి అప్పుల ఊబి నుండి రైతులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో కెరీర్ గైడెన్స్ పై అవగాహన

విశాలాంధ్ర-మదనపల్లి: మిట్స్ కళాశాల పూర్వ విద్యార్థి కె. షణ్ముఖ సాయి, సీనియర్ సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఈవైజిడిఎస్ బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ ఇంటర్వ్యూలకి ప్రతి ఒక్కరు వారి స్కిల్స్ ను పెంపొందించుకొని హాజరు అవ్వాలని అన్నారు. హాజరవుతున్న కంపెనీకి సంబంధించిన సమచారాన్ని పూర్తిగా అధ్యయనం చేయాలి అని, ఎలాంటి ప్రశ్నలు వేస్తారో ఊహించి వాటికి జవాబులు ఎలా చెప్పాలో కూడా సన్నద్ధంగా ఉండాలన్నారు. ఏ ఇంటర్వ్యూకు అయిన సరే ఒక పది నిమిషాల ముందరే హాజరవాలి అని, మొదటి ఇంప్రెషనే బెస్ట్ ఇంప్రెషన కలిగేలా మాట్లాడాలి అని అన్నారు. ఇంటర్వ్యూ చేసే వారిని వారి సంస్థ గురించి ప్రశ్నలు వేయొచ్చు. ఇందువల్ల ఉద్యోగంపై మీకున్న ఆసక్తిని ఇంటర్వ్యూ చేసేవారు గుర్తించగలరు అని అన్నారు. కార్యక్రమం లో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కల్పన, కోఆర్డినేటర్ షహీద్, అలుమ్ని కో ఆర్డినేటర్ కిరణ్ లు పాల్గొన్నారు.

గుంటూరులో జరిగే ఏఐవైఎఫ్ శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

విశాలాంధ్ర -రాజంపేట:ఈనెల ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో 27 నుంచి 30 వరకు గుంటూరులో జరగబోయే శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని అన్నమయ్య జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సికిందర్ తో కలిసి ఏఐవై ఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ మాట్లాడుతూ దాదాపు వెయ్యి మంది ప్రతినిధులతో గుంటూరులో నాలుగు రోజులు పాటు శిక్షణ తరగతులు జరుగుతున్నాయని,అందులో సైద్ధాంతిక. వైజ్ఞానిక రాజకీయ అంశాలపై ఈ శిక్షణ తరగతులు జరుగుతాయి అన్నారు. ఈ తరగతులను బోధించడానికి వివిధ విశ్వవిద్యాలయాల నుంచి నిష్ణాతులైన ప్రొఫెసర్ హాజరవుతారని వీటితోపాటు వివిధ కళా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలకు సినీ కళాకారుడైన వందేమాతరం శ్రీనివాస్ రావు. గోరేటి వెంకన్న. నారాయణమూర్తి, బాబి, మాదాల రవి, సుద్దాల అశోక్ తేజ లాంటి కళాకారులు హాజరవుతున్నారని కావున అధిక సంఖ్యలో హాజరై ఈ రాష్ట్ర స్థాయి ఏఐవైఎఫ్ జయప్రదం చేసి వారు కోరారు. ఈ కార్యక్రమంలో హరి, నాని ,సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్యలో ముగిసిన ఆర్టిఫిషియల్ వర్క్ షాప్

విశాలాంధ్ర -రాజంపేట: బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్ఈ, ఏఐడీఎస్, ఏఐఎంఎల్ ఆధ్వర్యంలో మూడురోజులపాటు జరిగిన ఆర్టిఫిషియల్ వర్క్ షాప్ శనివారంతో ముగిసింది. ఈ ముగింపు వర్క్ షాప్ వేడుకలలో కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వర్క్ షాపులో విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కు సంబంధించిన చార్ట్ బోర్డు డిజైన్ గురించి అవగాహన పెంచుకున్నారన్నారు. అలాగే క్లౌడ్ అప్లికేషన్ అభివృద్ధి గురించి తెలుసుకున్నారన్నారు. స్పేస్ అప్లికేశన్ ప్రాముఖ్యత గురించి తెలుసుకొని వాటిమీద విద్యార్థులు యాప్సను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ యాప్లలో కొన్నింటిని ఎన్నుకొని వాటి అభివృద్ధికోసం కృషి చేయడం జరుగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఈ హెచ్ ఓడీ డాక్టర్ ఎం పద్మలలిత, ఎడీఎస్ హెచ్ ఓడీ డాక్టర్ పి పణీంద్రకుమార్, ఏఐఎంఎల్ హెచ్ ఓడీ డాక్టర్ టి హరికృష్ణ, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు గోడ పత్రాలు విడుదల

విశాలాంధ్ర-నందలూరు ::నందలూరులోని ప్రసిద్ధ శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి జులై నెల 7 వరకు జరుగనున్న సందర్భంగా టీటీడీ అధికారి నటేషన్ ఆధ్వర్యంలో శనివారం గోడ పత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వి.యస్.కె.ఆదిత్య, రూరల్ సి.ఐ పుల్లయ్య, ఎంపీపీ మేడా విజయ బాస్కర్ రెడ్డి, మాజీ ఆలయ చైర్మన్ సౌమిత్రి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యార్థుల ఆణిముత్యాలు కార్యక్రమం

విశాలాంధ్ర-పీలేరు: స్థానిక కలికిరి మండలం జడ్పీహెచ్ఎస్ చదివేవాళ్ళపల్లిలో జగనన్న విద్యార్థుల ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాధించిన మార్పులు ఆధారంగా మొదటి బహుమతి ఎస్ రెడ్డి రియాజ్ రెండవ బహుమతి బహుమదాసి మరియు మూడో బహుమతి తహసీన్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్ రెడ్డి మరియు ప్రధానోపాధ్యాయుడు సంపత్ మరియు 9వ వార్డు మెంబర్ ఖాదర్బాషా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్. ఉషారాణి. అరుంధతి. మంగమ్మ. సహదేవ. సరస్వతి. రామానుజమ్మ విద్యార్థులు తల్లిదండ్రులు మరియు పాఠశాల పిసి నెంబర్లు పాల్గొనడం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లి రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డ సంఘటన శనివారం మదనపల్లి మండలంలో జరిగింది. మదనపల్లి మోతి నగర్ లో ఉంటున్న అక్బర్ కుమారుడు సైఫల 40 సొంత పనిమీద బెంగళూరుకి వెళ్ళాడు. పని ముగించుకుని బైకులు తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, మార్గమధ్యంలోని చిపిలి సమీపంలో బైక్ అదుపుతప్పి పడి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితున్ని స్థానికుల సాయంతో 108 సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించక చికిత్స పొందుతున్నాడు.

జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: కలెక్టర్

23న జగనన్న సురక్ష కార్యక్రమం యాప్‌ను ప్రారంభించనున్న సీఎం: ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి రేవు ముత్యాలరాజు

విశాలాంధ్ర-రాయచోటి : ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న "జగనన్న సురక్ష" కార్యక్రమాన్ని జిల్లాలో ప్రణాళిక బద్ధంగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి నారాయణ భరత్ గుప్తాతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న "జగనన్న సురక్ష" కార్యక్రమం అంశంలో ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాలరాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యదర్శి మాట్లాడుతూ ఈ నెల 23న ముఖ్యమంత్రి "జగనన్న సురక్ష" యాప్‌ను వీసీ ద్వారా లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. అనంతరం జూన్ 24 నుంచి 30 వరకు పట్టణ, గ్రామ వార్డులలో వాలంటీర్ గృహ సారథులు ఇంటింటికి వెళ్లి పౌరులలో కార్యక్రమంపై అవగాహన కల్పించి ప్రచారం నిర్వహించడంతో పాటు ప్రజల సమస్యలను నమోదు చేసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్ మాట్లాడుతూ అధికారులు బాధ్యతాయు తంగా కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. ముఖ్య మంత్రి యాప్ ను ప్రారంభించిన అనంతరం వారం పాటు వాలంటీర్ గృహ సారథులు ఇంటింటికి వెళ్లి అమలవుతున్న పథకాలకు సంబంధించి పౌరులతో చర్చించి సమస్యలను గుర్తించి వాటిని నమోదు చేసుకొని, సదరు వివరాలను సంబంధిత డిజిటల్ అసిస్టెం ట్లకు ఇవ్వాలన్నారు. ఆయా సమస్యలపై డిజిటల్ అసిస్టెంట్లు ఈ సర్వీస్ ద్వారా తప్పనిసరిగా సర్వీస్ రిక్వెస్ట్ నమోదు చేయాలన్నారు. తాసిల్దార్ మరియు ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జూలై 1 నుంచి 22 వరకు సదరు రెండు బృందాలు వారికి కేటాయించిన ప్రతి సచివాలయంను సందర్శించి, ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులను పరిశీలించాలని, ఇందులో ముఖ్యంగా సర్టిఫికెట్ జారీ, అమలవుతున్న పథకాలు, ద్వై వార్షిక మంజూరు అంశాలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ వార్డు సచివాలయ జిల్లా కోఆర్డినేటర్ మనోహర్ రాజు, డిపిఓ ధనలక్ష్మి, జడ్పీ కోఆర్డినేటర్ రమణారెడ్డి, డీఎస్ఓ రఘురాం, సిపిఓ కృష్ణా నాయక్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే మీ లక్ష్యమా:సిపిఐ

విశాలాంధ్ర- సుండుపల్లె : మండల కేంద్రంలోని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు విశ్వనాథ నాయక్ మాట్లాడుతూ రాజంపేట శాసనసభ్యులుగా సుండుపల్లెలో బస్టాండు కట్టి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విశ్వనాథ్ నాయక్ డిమాండ్ చేశారు. లేకుంటే రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదర్శంగా తీసుకో.. శ్రీకాంత్ రెడ్డి దగ్గర క్లాసులు నేర్చుకో రాజంపేట అభివృద్ధికి దోహదపడతాయి అన్నారు. ఒండుసార్లు శాసనసభకు పంపిస్తే రాజంపేట నియోజకవర్గ ప్రజలకు ఏం మంచి చేశావు నిరూపించుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇంటింటికి తాగునీటి కుళాయి ఏర్పాటు చేసి రోళ్ళమడుగు నీటిని తెప్పిస్తామని 60 శాతం పనులు పూర్తి చేసి మీ స్వలాభం కోసం పార్టీ ఫిరాయించిన ఘనత నీది అన్నారు. సుండుపల్లి మండలంలో 14 గ్రామ పంచాయతీల ప్రజలకు తాగునీటి సమస్య ఉంది. ఝరీకోన నీటిని సుండుపల్లెకు అందించి రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యారన్నారు. జగనన్న ఆశయ సాధన కోసం గ్రామ పంచాయతీ సచివాలయ నిర్మాణం కోసం కోట్లు విలువ చేసే స్థలాన్ని ఇచ్చిన ఘనత యర్రపురెడ్డి అజయ్ రెడ్డిది. రానున్న ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని చిత్తశుద్ధితో ఓడించే రోజులు దగ్గరలో ఉన్నాయి. అభివృద్ధి చేయండి ఓటు అడగండి మిమ్మల్ని ప్రజలు గెలిపిస్తారు. అభివృద్ధికి లక్షలు విలువ చేసే స్థలాన్ని కొని ఇస్తాము బస్టాండు నిర్మాణానికి ప్రభుత్వానికి డబ్బు ఇస్తాము మా మండలాన్ని అభివృద్ధి చేయండి అని యర్రపురెడ్డి అజయ్ రెడ్డి కుటుంబం చెబుతుంటే కొంతమంది అభివృద్ధిని అడ్డుకునేందుకు ఇక్కడ నిర్మాణం చేయండి అక్కడ నిర్మాణం చేయండి అని ప్రచారాలు చేయడం మంచి సాంప్రదాయం కాదన్నారు. సుండుపల్లి మండలంలో భైరవగుట్ట వద్ద నుండి ఈడిగపల్లె వరకు ఎక్కడైనా బస్టాండు నిర్మాణం చేయండి. అందుకు మేము అందరం స్వాగతిస్తామని ఎక్కడైనా సరే బస్టాండు నిర్మాణం చేయాలని నిర్మాణం జరిగితే మండల ప్రజలందరికీ మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సోషలిస్టు నాయకులు పల్లం నాగేంద్ర, లంబాడ సంఘం జాతీయ నాయకులు మూడే శంకర్ నాయక్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమల్ల రంగారెడ్డి, వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వెంకటేష్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు అరుణ్‌కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొంచిఉన్న ప్రమాదం-ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని ప్రయాణం

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండలంలోని కడప రేణిగుంట జాతీయ రహదారి నుండి సూరపురాజుపల్లికి వెళ్లె ప్రధాన రహదారిలోని గుంజన ఏటిపై ఉన్న బ్రిడ్జికి ఇరుపక్కల ఉన్న రక్షణ దిమ్మెలు విరిగిపోయి శిథిలమయ్యాయి.వాహనాలు అదుపు తప్పితే గుంజనలో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. కొన్ని సందర్భాలలో వాహనాలు అదుపు తప్పి బ్రిడ్జి నుంచి కిందపడి తీవ్ర గాయాలయలకు గురయ్యారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి బ్రిడ్జికి ఇరువైపులా దెబ్బ తిని విరిగిపోయిన రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. భారీ వరదల సమయంలో బ్రిడ్జి ఎక్కడ ఉండేది తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా సూరపురాజుపల్లి, ఎస్టీ కాలనీ, చంగల్ రాజుపల్లి, విపిఆర్ ఖండ్రిక, అబ్బిరాజుగారిపల్లి, కొండయ్యగారిపల్లి పొట్టిరాజుగారిపల్లి, గంగురాజుపోడు, ఎస్టీ కాలనీ, శిద్దిరాజుఖండ్రిక, కమలానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లె వారు ఈ రహదారి గుండానే ప్రయాణిసు న్నారు. మోటర్ బైకులు, ఆటోలు, జీబులు, కార్లు, సుమోలు, వ్యాన్ లు, ట్రాక్టర్లు ఈ రహదారి గుండానే తిరుగుతున్నాయి. ప్రమాదాలు జరగకుండా రహదారిని విస్తరించాలని స్థానికులు కోరుతున్నారు. భారీ వరదల సమయంలో రైతులకు చెందిన వ్యవసాయ భూములు కోతకు గురికాకుండా ఇరువైపులా రక్షణ గోడలు ఎర్పాటు చెసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే చాలా భూములు కోతకు గురయ్యాయి.లక్షలాది రూపాయలు ఖర్చు చేసి కష్టపడి పండించుకున్న ఉద్యాన పంటలు వరదల్లో కొట్టుకు పోతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయడమే శ్రీకాంత్ రెడ్డి లక్ష్యం

జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి సభ్యులు దిన్నెపాడురవిరాజు

విశాలాంధ్ర - రాయచోటి : ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆదేశాలతో ఆయన సూచన మేరకు జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేయడం లక్ష్యంగా పనిచేయాలని రవిరాజు పేర్కొన్నారు. శనివారం రాయచోటి సెర్ప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశానికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పిడి మద్దిలేటి, జిల్లా వ్యవసాయ శాఖ మండల సభ్యులు దిన్నెపాడు రవిరాజు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష జిల్లాను హార్టికల్చర్ హబ్ చేయడానికి డ్వామా సిబ్బందికి ఐదువేల ఎకరాల పైన పండ్లతోటల పెంపకానికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశాలు ఇచ్చి ఉన్నారన్నారు, 23 24 సంవత్సరానికి సంబంధించిన పండ్ల తోటల పెంపకంతో పాటు అన్ని రకాల బ్లాక్, ఎవెన్యూ ప్లాంటేషన్ల ప్రణాళికలను త్వరగా సిద్ధం చేసి ఉపాధి సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంతోపాటు రైతులు ఆదాయం పొందడం పర్యావరణాన్ని కూడా పరిరక్షించిన వారవుతారన్నారు. రైతన్నలు బుధవారం లోపు దరఖాస్తులను ఉపాధి సిబ్బందికి అందజేయాలని పిడి మద్దిలేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిడీలు రవికుమార్, రెడ్డయ్య నాయుడు, ప్లాంటేషన్ మేనేజర్ శివ వర్మ, ఏపీవోలు, వెలుగు పీవోలు, ఈసీలు, ప్లాంటేషన్ సూపర్వైజర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కోసం దారుణ హత్య- పరారీలో నరహంతకుడు

ముమ్మరంగా పోలీసుల గాలింపు -ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ గంగాధరరావు

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలంలోని సొంతంవారిపల్లి గ్రామ పంచాయతీలో బంగారు అపహరణ కోసం దారుణహత్య జరిగినట్లు సుండుపల్లె పోలీసులు తెలిపారు. భార్యాభర్తలపై అగంతకుడు దాడి చేయగా రామానుజుల రెడ్డిని హతమార్చినట్లు తెలిపారు. రాయచోటి రూరల్ సిఐ లింగప్ప, సుండుపల్లి ఎస్సై రామకృష్ణారెడ్డి శుక్రవారం అర్ధరాత్రి సమయంలో హత్య జరిగిందని సమాచారం వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నట్లు తెలియజేశారు. పోలీసు బృందం హంతకుని కోసం గాలింపు నిర్వహించగా అప్పటికే హంతకుడు అదే గ్రామానికి చెందిన పవన్ కుమార్ పరారైనట్లు తెలియజేశారు. బంగారం దొంగతనం కోసం వచ్చినట్లు మృతుని భార్య మనోహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. ఫిర్యాదులో మనోహరి భర్తను గొంతు కోసి హతమార్చి కారంపొడి చల్లి తోటలో నిద్రిస్తున్న మనోహరి బంగారు గొలుసు కోసం వెతుకుతున్న తరుణంలో కేకలు వేయడంతో కొడవలితో నరికే సమయంలో మనోహరి కొడవలి పట్టుకోవడం వలన చేతులు తెగి గాయాలైనట్లు తెలియజేశారు. మృతుడు రామాంజుల రెడ్డి (50)కి ఒక కొడుకు, కూతురు భార్య ఉన్నారు. రామాంజుల రెడ్డి మృతితో కొండల తూర్పులో విషాద ఛాయలు అలుముకున్నాయి.

హంతకుడిని పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటాం: ఎస్పీ

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్ రావు హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. పరారీలో ఉన్న హంతకుని కోసం నాలుగు బృంధాలుగా పోలీసు లు గాలిస్తున్నట్లు సిబ్బంది తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు ఎస్పీ తెలియజేశారు. అనంతరం సుండుపల్లె పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు.

ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలి:ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మోడల్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్స్ మరియు సిబ్బంది కొరతను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, సిపిఐ ఏరియా కార్యదర్శి సిద్దిగాల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక లక్కిరెడ్డిపల్లి లోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభం అవడంతో పదవ తరగతి పూర్తిచేసిన అనేకమంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ మరియు మోడల్ కళాశాలలో అడ్మిషన్లను పొందుతున్నారని అయితే జిల్లా వ్యాప్తంగా అనేక ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్స్ లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారు అన్నారు. ఏఐఎస్ఎఫ్ లక్కిరెడ్డిపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మధు, హర్షవర్ధన్లను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు , సిపిఐ ఏరియా కార్యదర్శి సిద్దిగాల శ్రీనివాసులు తెలిపారు. సహాయ కార్యదర్శిలుగా రోషిని, సాయికుమార్ ఉపాధ్యక్షులుగా మణికంఠ, రేణుక లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఏఐవైఎఫ్ శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -రాజంపేట : ఈనెల ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో 27 నుంచి 30 వరకు గుంటూరులో జరగబోయే శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని అన్నమయ్య జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక ఏఐటీయుసి కార్యాలయంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సికిందర్ తో కలిసి ఏఐవై ఎఫ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ మాట్లాడుతూ దాదాపు వెయ్యి మంది ప్రతినిధులతో గుంటూరులో నాలుగు రోజులు పాటు శిక్షణ తరగతులు జరుగుతున్నాయని,అందులో సైద్ధాంతిక. వైజ్ఞానిక రాజకీయ అంశాలపై ఈ శిక్షణ తరగతులు జరుగుతాయి అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు సినీ కళాకారుడైన వందేమాతరం శ్రీనివాస్ రావు. గోరేటి వెంకన్న. నారాయణమూర్తి .బాబ్జి. మాదాల రవి. సుద్దాల అశోక్ తేజ లాంటి కళాకారులు హాజరవుతున్నారని కావున అధిక సంఖ్యలో హాజరై ఈ రాష్ట్ర స్థాయి ఏఐవైఎఫ్ జయప్రదం చేసి వారు కోరారు ఈ కార్యక్రమంలో హరి. నాని .సుబ్రమణ్యం. తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలు పంపిణీ

విశాలాంధ్ర-గుర్రంకొండ :2022 2023 సంవత్సరానికి చెందిన ప్రభుత్వ పాఠశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడంతో మొదటి ద్వితీయ తృతీయ స్థానాల్లో విద్యార్థులకు ప్రోత్సాహకంతో పాటు ప్రశంసా పత్రం సన్మాన కార్యక్రమాన్ని శనివారం ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర ఎంపిటిసి ఖదీరుల్ల చేతులు మీదుగా అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకొని వాటి ద్వారా మంచి మార్కులు సాధించి రాష్ట్రంలో ఉన్నత స్థాయి ర్యాంకులను సాధించాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గౌస్ బాషా ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

జిల్లా వైద్యాధికారి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-నందలూరు :: మండల పరిధిలోని నాగిరెడ్డి పల్లి-2 విలేజ్ హెల్త్ క్లినిక్‌ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రామ్ మరియు వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరు మరియు రికార్డుల పరిశీలన చేసి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ చంద్ర శేఖర్ రెడ్డి, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ చంద్ర శేఖర్ రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశాలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల బాలికలకు ప్రోత్సహక బహుమతులు

విశాలాంధ్ర-పీలేరు : విద్యారంగములో విజయం సాధించాలంటే ప్రతి విద్యార్థిని కష్టాన్ని ఇష్టపడాలని అప్పుడే లక్ష్యసాధన సాధ్యపడుతుందని పీలేరు పట్టణ యువ వైసిపి నాయకులు కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు. శనివారం పీలేరు పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల పదవ తరగతి లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన బాలికలకు, నగదు ప్రోత్సావాహక బహుమతులు చైతన్య రెడ్డి అందజేశారు.మొదటి బహుమతిగా ఎం. సౌందర్య కు 20వేల రూపాయలు ,రెండవ బహుమతి ఎం.ప్రసన్నకు పది వేల రూపాయలు చైతన్య రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. తలుపుల వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ ప్రతి బాలిక బలమైన ఆరోగ్యంతో నే మెరుగైన చదువు సాధ్యం అనికావున మంచి పౌష్టికాహారం, వ్యక్తిగత శుభ్రత,చేతుల శుభ్రత,నిజ జీవితంలో మంచి పలితాల్ని ఇస్తుందని తెలిపారు.కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ నాయక్,ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం భార్గవి, మహిళా పోలీసు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం

విశాలాంధ్ర-రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటి వాస్తవ్యులు ముక్కపల్లి నాగేంద్ర,నీలవేణి దంపతుల రెండవ కుమార్తె ముక్కపల్లి జాహ్నవి పుట్టినరోజు సందర్భంగా రామాపురం మండలం బండపల్లి పంచాయతీ ప్రేమాలయం వృద్ధాశ్రమంలో శనివారం వృద్ధులకు అన్నదానం చేయడం జరిగిందని అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ తెలిపారు .అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు వేడుకలు, పెళ్లిరోజు వేడుకలకు డబ్బులు వృధా చేయకుండ తమ వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు చేయాలని కోరారు. రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో చేయడానికి మా వంతు సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్, వినోద్ కుమార్ నాయక్, దాత కుటుంబ సభ్యులు సుశీల, నాగరాజ,భారతి, నరేష్, పవన్, ప్రేమాలయం దేవనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం

విశాలాంధ్ర-రామాపురం: 2023 మార్చిలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ. ద్వితీయ. తృతీయ. స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థిలకు ఆ గ్రామ సర్పంచ్ ముంగర సరోజమ్మ .మాజీ సర్పంచ్ ముంగర సుబ్బయ్యలు నగదును అందజేశారు. మండలంలోని గోపగుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ముంగర సుబ్బయ్య మాట్లాడుతూ 2023 మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ. ద్వితీయ. తృతీయ. స్థానాలలో మార్కులు సాధించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇలియాస్. ఉపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య. మల్లయ్య .బలరాం. వెంకటరమణ. ఆ గ్రామ ఉప సర్పంచ్ వెంకటరమణ. పాఠశాల చైర్మన్ రామ్మోహన్.చెంచయ్య పలువురు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్య ఆటపాటల విద్య : సిడిపిఓ

విశాలాంధ్ర -సుండుపల్లె : సుండుపల్లె అంగన్వాడి విద్య ఆటపాటల విద్య అని సిడిపిఓ సుగుణ తెలిపారు. శనివారం సుండుపల్లి మండలంలో పలు గ్రామ పంచాయతీలలో బాలల భవితకు భాగస్వామ్యం అనే కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో సుగుణ మాట్లాడుతూ గ్రామ పెద్దలను తల్లిదండ్రులను ఆహ్వానించి మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాలలోపు పిల్లలకు విద్య యొక్క ప్రాముఖ్యత గురించి మరియు ఆటపాటలతో విద్య పిల్లలకు బంగారు భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలు పునాదులు లాంటివని, కావున ప్రతి ఒక్కరూ ప్రతి తల్లిదండ్రులు తన పిల్లలను అంగన్వాడి కేంద్రాల్లో పంపవలసిన కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సు ఉద్యోగుల కిచ్చిన హామీలు అమలు చేయాలి

- సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి
- ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండు

విశాలాంధ్ర - మదనపల్లె: కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని వైసీపీ ప్రభుత్వం హామీలిచ్చింది. కానీ ఈ హామీలకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం 6,867 మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని ప్రకటించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో ఇంత మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని చెప్పలేదు. అందరిని రెగ్యులరైజ్ చేస్తామంది. కానీ దీనికి భిన్నంగా ప్రభుత్వం ప్రకటన చేయడం 3. లక్షల మంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను మోసగించడమే అని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్ కుమార్ శనివారం తెలిపారు.ఆంధ్రప్రదేశ్లో 17 కార్పొరేషన్లు, 78 మున్సిపాలిటీలు, 31 నగర పంచా యతీలలో పనిచేస్తా ఉన్న కార్మికులు 54,000 మంది నీ మోసం చేసిన వైఎస్ఆర్సిపి ప్రభుత్వం కోవిడ్ 19 వల్ల దేశంలో ప్రజలు ఎవరే గానీ రోడ్లపై పరిస్థితులలో పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులు రోడ్లపై నుండి ప్రజలకి నిత్యం సేవలందించిన కార్మికుల్ని ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం నట్టేట ముంచిందన్నారు. పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికులు 54000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరంతా ఏ నాటికైనా తాము రెగ్యులర్ అవుతామన్న ఆశతో సేవలందిస్తున్నారు. అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అందరిని రెగ్యులరైజ్ చేస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీవ్ర ఆందోళనకు, అసంతృప్తికి దారి తీసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని ఇచ్చిన హామీ ప్రకారం. పారిశుద్ధ్య ,ఇంజనీరింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, డిమాండ్ చేస్తోందన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో తక్కువ వేతనాలతో జీవోలను విడుదల చేసి కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల శ్రమను దోచుకుంటున్నారుని ఆరోపించారుపెరిగిన నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు, కరెంటు ఛార్జీలు, రవాణా ఛార్జీలతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని. వీటి పరిష్కారానికై అందరు కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కొత్తగా వచ్చారని, ఏడాదే అయ్యిందంటూ మాంత్రి బొత్సా సత్యనారాయణ గారి వ్యాఖ్యలు సరైనవి కాదని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉమ్మడి రాష్ట్రం కాలం మండి విధులు నిర్వహిస్తున్నారని,ప్రజలకు సేవలందిస్తున్నారని వర్రి సురేష్ కుమార్ తెలిపారు. వీరు జాయిన్ అయి ఏడాది అయ్యిందన్న మంత్రి వర్యులు. వాస్తవాలను తెలుసుకుని మాట్లాడటం మంచిదన్నారు. రాష్ట్రంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు దాదాపు 20 నుండి 15 సంవత్సరాలుగా పని చేస్తున్నారని నామమాత్రపు వేతనాలిచ్చి పని చేయించుకుంటూ కనీసం ఎన్ని సంవత్సరాల నుండి పనిచేస్తున్నారో తెలియని స్థితిలో మంత్రులు, అధికారులు ఉండటం శోచనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ నాగరాజు, వరప్రసాద్, పృథ్వీరాజ్,వాసు,మధు,శేఖర్, క్లాప్ ఆటో డ్రైవర్లు, బబ్లు,మూర్తి,రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూనియల్ కళాశాల బాలికలకు ఒక వరం: ప్రిన్సిపాల్

విశాలాంధ్ర-నందలూరు : మండలంలోని నాగిరెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నూతనంగా మంజూరు అయిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రారంభం సందర్భంలో పాఠశాల విద్యా కమిటీ మరియు అధ్యాపక బృందం కలిసి శనివారం ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో పాఠశాల ప్రిన్సిపాల్ డి. గంగి రెడ్డి మాట్లాడుతూ నాగిరెడ్డి పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల కళాశాల ఏర్పాటు చేయడం పరిసర ప్రాంతంలో ఉన్న బాలికలకు ఒక వరమని చెప్పారు. అధ్యాపకులు ఎన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని సుదూర ప్రాంతాలకు వెళ్ళనవసరం లేకుండానే ప్రభుత్వం జిల్లా పరిషత్ పాఠశాలలో బాలికల జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అని చెప్పారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న బాలికలు అందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు . ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసాద్, వెంకటసుబ్బయ్య, రవి శంకర్ రెడ్డి ,మస్తాన్ ,విజయ్ కుమారి పాల్గొన్నారు.

రైళ్లు ఆపాలని డిఆర్ఎంకు వినతి

విశాలాంధ్ర-నందలూరు : నందలూరు రైల్వే కేంద్రం నందు తనిఖీలో భాగంగా డిఆర్ఎం శుక్రవారం రాత్రి నందలూరుకు విచ్చేయగా రాజంపేట యువ నాయకులు మేడా విజయశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఆయన కు శాలువాతో సత్కరించి పలు సమస్యలపై వినతీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నందలూరు నందు రెండు రైళ్లను నిలుపుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, హైదరాబద్ తిరుపతికి వెళ్ళు రైళ్లను కూడా నిలుపుదల చేయాలని, స్థానిక క్రీడామైదానం నందు మట్టిని తరలించి క్రీడాకారులకు అనువుగా వుండేటట్లు అభివృద్ధి చేయాలని కోరగా డిఆర్ఎం రమణారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతురాజు మస్తానయ్య, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ జంబు సూర్యనారాయణ, నందలూరు సర్పంచ్ మోడపోతుల రాము, అరిగెల మణి, మండెం నాగరాజు, కొర్లకుంట సుధాకర్, మెహర్ ఖాన్, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, చుక్క వెంకటేశ్వర్లు, కాకి చంద్ర, గుగళ్ళ సుబ్బరాయుడు, మహేష్, కానుకుర్తి వెంకటయ్య, పుత్త శంకర్, అరిగెల హరి, ఎల్లంరాజుపల్లి శ్రీనివాసులు రెడ్డి, నాగిరెడ్డిపల్లి, నందలూరు పంచాయతీల సీనియర్ నాయకులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్య అంటే మానవునిలో దాగివున్న అంతర జ్ఞానాన్ని వెలికి తీయడమే

మార్గదర్శి డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో సిఐ మోహన్ రెడ్డి



విశాలాంధ్ర-పీలేరు: విద్య అంటే మానవునిలో దాగివున్న అంతర-జ్ఞానాన్ని వెలికి తీయడమేనని పీలేరు అర్బన్ సిఐ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.శనివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో మార్గదర్శి డిగ్రీ కళాశాల వార్షికోత్సవ సభలో పీలేరు అర్బన్ సిఐ.మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటలాడుతు విద్య అనగా బోధన, నిర్దిష్ట నైపుణ్యాల అభ్యాసనల సమీకరణం. ఇంకనూ విశాలమైన భావంలో, పరిజ్ఞానాన్ని, ధనాత్మక తీర్పును, జ్ఞానాన్ని ఇవ్వడం. విద్య ప్రాథమిక ఉద్దేశం, సంస్కృతిని వారసత్వాలకు అందిస్తూ సామాజ కీయం జేయడం. విద్య అంటే మానవునిలో దాగివున్న అంతర-జ్ఞానాన్ని వెలికి తీయడంమని చాలా చక్కగా వివరించారు. మారుతున్న కాలనుగుణంగా యువత పక్కదోవ పడకుండ తగు జాగ్రత్తలు తీసుకొని అనుకున్న లక్ష్యాలకు చేరుకోవాలని ఉద్బుదించారు. పీలేరు పట్టణంలో మార్గదర్శి డిగ్రీ కళాశాల క్రమశిక్షణకు మారుపేరుగా ఉండడమే పరీక్ష ఫలితాలలో అగ్రగామిగా నిలుస్తున్నదని అన్నారు. మరో విశిష్ట అతిథి మోటివేషన్ స్పీకర్, రేవతి ఫౌండషన్ (కుప్పం)డి.జీ. రామూర్తి మాటలాడుతు విద్య అనగా జ్ఞానం సముపార్జించడం. పూర్వకాలంలో విద్యర్థులు గురువుల వద్ద ఉండి వారికి సేవ చేస్తూ విద్యను పొందేవారు. కాలక్రమేణా విద్య యొక్క స్వరూపం మరియు అర్థం మారిపోయింది. ఇది చదువుకు పర్యాయపదంగా మారిందని అన్నారు. అందుకు భిన్నంగా చక్కటి వాతావరణంలో డిగ్రీకి చెందిన విద్యార్థులకు తమదైన శైలిలో మెరుగైన విద్యను అందిస్తు ముందుకు వెళు తున్నదని ఆయన పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతికా కార్యక్రమలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో మార్గదర్శి డిగ్రీ కళాశాల కరెస్పాండంట్ నాగార్జున రెడ్డి,ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ నాయుడు, డైరెక్టర్లు సుధానంద రెడ్డి, జనార్దన్ రెడ్డి,చంద్రశేఖర్, లోకేశ్వర్ రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి

- జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలి - కలెక్టర్ గిరీషా పి.ఎస్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న "జగనన్న సురక్ష" కార్యక్రమాన్ని జిల్లాలో ప్రణాళిక బద్ధంగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి నారాయణ భరత్ గుప్తాతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించనున్న "జగనన్న సురక్ష" కార్యక్రమం అంశంలో... ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాలరాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రాయచోటి కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యదర్శి మాట్లాడుతూ... ఈ నెల 23న రాష్ట్ర ముఖ్యమంత్రి గారు "జగనన్న సురక్ష" యాప్ ను వీసీ ద్వారా లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. అనంతరం జూన్ 24 నుంచి 30 వరకు పట్టణ, గ్రామ వార్డులలో వాలంటీర్ గృహ సారధులు ఇంటింటికి వెళ్లి పౌరులలో కార్యక్రమం పై అవగాహన కల్పించి ప్రచారం నిర్వహించడంతోపాటు... ప్రజల సమస్యలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్ స్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయిలో పర్యవేక్షణ చేయడానికి అధికారుల బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కలెక్టర్ సారథ్యంలో జిల్లాస్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీష పి.ఎస్ మాట్లాడుతూ... అధికారులు బాధ్యతాయుతంగా కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యమంత్రి గారు యాప్ ను ప్రారంభించిన అనంతరం వారం పాటు వాలంటీర్ గృహ సారధులు ఇంటింటికి వెళ్లి... అమలవుతున్న పథకాలకు సంబంధించి పౌరులతో చర్చించి సమస్యలను గుర్తించి వాటిని నమోదు చేసుకొని, సదరు వివరాలను సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లకు ఇవ్వాలన్నారు. ఆయా సమస్యలపై డిజిటల్ అసిస్టెంట్లు ఈ సర్వీస్ ద్వారా తప్పనిసరిగా సర్వీస్ రిక్వెస్ట్ నమోదు చేయాలన్నారు. తాసిల్దార్ మరియు ఎంపీడీవో ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జూలై 1 నుంచి 22 వరకు సదరు రెండు బృందాలు వారికి కేటాయించిన ప్రతి సచివాలయంను సందర్శించి, ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులను పరిశీలించాలని, ఇందులో ముఖ్యంగా సర్టిఫికెట్ జారీ, అమలవుతున్న పథకాలు, ద్వై వార్షిక మంజూరు అంశాలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. మిగిలిన వాటిని సదరుకాల పరిమితిలోపు పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. ప్రతి టీం వారంలో మూడు రోజులు మాత్రమే క్షేత్రస్థాయిలో పర్యటించి, సచివాలయాలను సందర్శించాలని సూచించారు. డివిజన్ స్థాయిలో ఆయా ఆర్డీవోలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాలని, కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ జిల్లా మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రామ వార్డు సచివాలయ జిల్లా కోఆర్డినేటర్ మనోహర్ రాజు, డిపిఓ ధనలక్ష్మి, జడ్పీ కోఆర్డినేటర్ రమణారెడ్డి, డీఎస్ఓ రఘురాం, సిపిఓ కృష్ణా నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించాలి

- కంప చెట్లతో నిండిపోయిన రోడ్లు- నిత్యం ప్రమాదాలు

విశాలాంధ్ర -బి కొత్తకోట: తంబళ్లపల్లి నియోజకవర్గం కురబలకోట మండలం ముదివేడు నుండి లక్క సముద్రం వైపు వెళ్ళు రోడ్డు పిచ్చల వారి పల్లి నుండి లక్కసముద్రం వరకు రోడ్డుకు ఇరువైపులా భారీగా కంప చెట్లు నిండిపోవడంతో నిత్యం ప్రమాదాలకు నెలవైంది. కంప చెట్లు రోడ్డుకు అలుముకోవడంతో ప్రధాన మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనం ద్విచక్ర వాహనాలు ఏమాత్రం కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్టీసీ బస్సులు ప్రైవేటు వాహనాలు డ్రైవర్లు ఆ దారి గుండా వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిందే ఎప్పుడు ప్రమాదం ముంచకొస్తుందో అని భయం భయంగా డ్రైవింగ్ చేయాల్సిందే కొన్ని సంవత్సరాలుగా రోడ్లు భవనాల శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరం. రోడ్డుకి విరువైపులా భారీగా కంప చెట్లు నిదర్శనం రోడ్డు ఇరువైపులా ఇంత భారీగా కంప చెట్లు ఉండడం రోడ్లు బోనాల శాఖ అధికారులకు కనబడవా అని వాహనదారులు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కంపచెట్లు తొలగించకపోతే ఆర్టీసీ బస్సు డ్రైవర్ల సైతం ఈ రోడ్డు గుండా బస్సులు నడపలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు బోనాల శాఖ అధికారులు స్పందించి రోడ్డుకి ఇరువైపులు ఉన్న కంపచెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

జగనన్న ఆణిముత్యాలు పొందేలా కృషి చేయాలి

విశాలాంధ్ర- మదనపల్లి: 23వ వార్డు పరిధిలో ఉన్న నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో శనివారం జగనన్న ఆణిముత్యాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ వి.మనూజ రెడ్డి ,కౌన్సిలర్ గిరిజ సాయి శేఖర్ రెడ్డి లు మాట్లాడుతూ టెన్త్ లో మంచి మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంగా నగదు బహుమతి ఇవ్వడం సంతోషం అన్నారు.వచ్చే ఏడాది జరిగే టెన్త్ ఫలితాల్లో మీరు కూడా మంచి ఫలితాలు సాధించి జగనన్న ఆణిముత్యాలు సొంతం చేసుకోవాలని కోరారు.జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 457 మార్కులు సాధించిన ఎస్. జస్మిన్ తాజ్ మొదటి బహుమతి, రెండవ బహుమతి 437 మార్కులు పొందిన ఎస్. సానియా, మూడవ బహుమతి గాను 430 మార్కులు సాధించిన యస్.హర్షియా లకు జగనన్న ఆణిముత్యాలు కింద నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి, ఇంచార్జ్ హెచ్ఎం నాగు సులోచన, ఉపాధ్యాయులు లీల ,రత్నకుమారి ,రాధా, తేజవతి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి విద్యార్థులతోపాటు మున్సిపల్ చైర్ పర్సన్,కౌన్సిలర్ , ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు.

ధర్మాన్ని పరిరక్షణ పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది..

విశాలాంధ్ర-రామాపురం : ధర్మం .అధర్మం. అనేది ఇప్పటికి ఉన్నాయని ధర్మాన్ని ఆచరించే ఉద్దేశం అందరికీ ఉండాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు అన్నారు. మండల కేంద్రమైన రామాపురంలోని శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ నందు శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాలతో మెలగాలని. ధర్మాన్ని ఆచరించినప్పుడు ప్రతి ఒక్కరికి మంచి జరుగుతుందని అన్నారు. కుల వర్గ ప్రాంత భాష బేదాలకు ఆత్మీయంగా ఏకాత్మత భావాన్ని నిర్మించి హిందు సమాజం సంఘటన చేయడం హిందూ ధర్మం నుండి ఇతర మతాలకు వెళ్లిన సోదరులను తిరిగి ధర్మం స్వస్థానానికి వచ్చేటట్లు చూడాలన్నారు. మరలా మందిరాలను స్ఫూర్తి కేంద్రాలుగా శక్తి కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో దేశం మొత్తంలో సంపూర్ణ గో హత్య నిషేధం చేయాలని దానికి కావాల్సిన పోరాటాలు చేయడం లవ్ జిహాద్ నుంచి హిందూ మహిళల సంరక్షణ చేయడం కోసం పెద్ద ఎత్తున మాతృ మండలి దుర్గావాహిని సమితుల నిర్మాణం చేయడం హిందూ యువకులకు దేశభక్తి ధర్మరక్షణ సామాజిక సేవ స్వీయ రక్షణ కొరకు ప్రతి ప్రఖండ కేంద్రంగా బోలో సాసన శక్తి కేంద్రాల నిర్మాణము చేపట్టడం వంటివి విశ్వహిందూ పరిషత్తులో ప్రధాన అంశాలన్నారు. విశ్వహిందూ పరిషత్ గౌరవ అధ్యక్షుడు బైరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ హిందూ సమాజంలో ఉన్న కుల సంఘాలు మధ్య సమన్వాయం కోసం కుల సంఘాల పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి వారిని సమన్వయస్థితిలో ఉంచేందుకు కృషి చేయాలన్నారు. విశ్వహిందూ పరిషత్ దేశవ్యాప్తంగా ఆలయాల గోరక్షణ కోసం. హిందూ మహిళల రక్షణ కోసం. అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంత గోరక్షణ ప్రముఖ శ్రీనివాస్ నాయుడు. అన్నమయ్య జిల్లా బజరంగ్దల్ సురక్ష ప్రాముక్కో వీరారెడ్డి. లక్కిరెడ్డిపల్లి ప్రముఖ ఆంజనేయ రెడ్డి. దామోదర్ నాయుడు. అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి. సహ కార్యదర్శి రాజు. భాస్కర్ రెడ్డి. వెంకటసుబ్బారెడ్డి. ధర్మయ్య. గోవిందస్వామి. తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ పరిధిలో సమస్యలు పరిష్కరించాలి :ఎంపిడివో

విశాలాంధ్ర-రామాపురం: గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామ ప్రజల సమస్యలను వెంటనే ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పరిష్కరించాలని ఎంపీడీవో హైదర్ వల్లి అన్నారు. స్థానిక ఎంపీడీవో సభ భవనంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం పై గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న నుంచి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆరోజున గ్రామ పరిధిలోని ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే సర్టిఫికెట్లు. ప్రభుత్వ పథకాలు. సంబంధించిన సమస్యలను వాలంటరీలు గ్రామ సచివాలయ అధికారులు దృష్టికి తీసుకువస్తే 24న పరిష్కరిస్తామన్నారు. మండల శాఖ అధికారులు మండలంలో రెండు టీములుగా ఏర్పాటు చేసి మొదటి టీము ఎంపీడీవో. తాసిల్దార్. రెండోవ టీము తాసిల్దార్ ఈవోపీఆర్డి ఏర్పాటు చేస్తారన్నారు. వీరుకి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి అక్కడ ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని వాలంటీర్లు వాళ్ళ కేటాయించిన కుటుంబాలకు వెళ్లి ప్రజలకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే వాటిని గుర్తించి గ్రామ సచివాలయ సిబ్బందికి తెలియజేస్తే వెంటనే ఆ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అరవింద్ కిషోర్. ఈవోపీఆర్డి ఉషారాణి.ఆర్ ఐ రవికుమార్ గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని 3 లక్షల కాజేసిన ఓ ఉద్యోగి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: కలెక్టర్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని ఓ నిరుద్యోగుల వద్ద నుంచి 3. లక్షల 33 వేల రూపాయలు తీసుకొని మోసం చేశాడని బాధితుడు దుర్గ య్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపారు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్ గా పనిచేస్తున్న శాంతయ్య అనే వ్యక్తి దుర్గయ్య అనే నిరుద్యోగ వద్ద నుంచి ఉద్యోగం ఇప్పిస్తారని డబ్బులు వసూలు చేశాడని బాధితులు వాపోయాడని ఆయన తెలిపారు ఏడాది గడుస్తున్నా ఉద్యోగ విషయం మరిచాడని డబ్బులు అడిగితే నాకు తెలియదు అంటున్నాడు అని బాధితుడు ఫిర్యాదులు పేర్కొనట్లు ఆయన తెలిపారు జాబ్ ఫ్రాడ్ చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు ఇలాంటి వాటికి నిరుద్యోగులు ఎవరు ఉద్యోగాలు ఇప్పిస్తా ఉన్నవారి మాటలు విని మోసపోకూడదని ఆయన తెలియజేశారు.

పెండింగ్ కేసులలో విచారణ వేగవంతంగా పూర్తి చేయండి: ఎస్పీ

విశాలాంధ్ర రాయచోటి : కోర్టులలో పెండింగ్లో ఉన్న కేసులను వేగవంతంగా విచారణ చేపట్టాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్ రావు సూచించారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని కోర్టు కానిస్టేబుల్ లతో కోర్టులో పెండింగ్ లో ఉన్న కేసుల ట్రైల్ మానిటరింగ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా నేరం జరిగినప్పుడు ఆ నేరం చేసిన వ్యక్తికి త్వరితగతిన కోర్టులో శిక్ష పడితే మరొకరు అటువంటి నేరాలను చేయటానికి భయపడతారని,తద్వారా నేరాల సంఖ్యను,నేర ప్రవృత్తిని కట్టడి చేసి శాంతి భద్రతలు పరిరక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు.పెండింగ్ కేసులలో విచారణ ఏ విధంగా పూర్తి చేయాలనే విషయాలపై కోర్టు కానిస్టేబుల్ లకు పలు సూచనలు చేశారు.ప్రతి ఒక్క పోలీస్ అధికారి వారి పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల్లో శిక్ష పడటానికి ఎక్కువ అవకాశం ఉన్న 10 కేసులను ఎంపిక చేసుకొని వాటి ట్రయిల్ విషయంలో ప్రతిరోజు పర్యవేక్షించుకుంటూ ఉండాలన్నారు.కేసును ముందుకు సాగేలా సాక్షుల చేత స్వేచ్ఛగా నిర్భయంగా సాక్ష్యం చెప్పే లాగా తర్ఫీదు ఇవ్వాలని సూచించారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

-నీటి సరఫరా లోను నిలువు దోపిడి
- కబ్జాదారులకు దోపిడీదారులకు అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న వైసిపి ప్రభుత్వం

విశాలాంధ్ర-గాలివీడు : నీటి సరఫరా లో నిలువు దోపిడి చేసిన అక్రమాలను కప్పి పుచ్చుకోవడానికే టిడిపి పై చేసిన అసత్య ఆరోపణలను మానుకోవాలని వైకాపా నాయకులకు (నీటి ట్యాంకుల తోలకమ్దారులకు) మాజీ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు లక్ష్మయ్యలు, హితవు పలికారు. వారు మండల కేంద్రంలో శనివారం టిడిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందించిన తాగునీటి సరఫరా లోను అక్రమాలకు పాల్పడింది చాలక సిగ్గు ఎగ్గు లేకుండా అసత్య ఆరోపణలు చేయడంపై వారు మండిపడ్డారు .నిజంగా మీరు నీటి సరఫరా చేసి ఉంటే అప్పటి ఉమ్మడి కడప జిల్లా కలెక్టర్లు ఎందుకు అనుమతులు నిధులు మంజూరు చేయలేదన్నారు. రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా నీటిని తోలకుండా నే కోట్లాది రూపాయల బిల్లులు చేసుకున్నది చాలక తిరిగి టిడిపి పైనే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.చేసేది తప్పుడు పనులు ఆ పై ఏ దురు దాడి చేయడం వైకాపా నాయకులకే చెల్లిందన్నారు. తరతరాల నుంచి వంకలు,వాగులు ,చెరువులలో పేరుకుపోయిన మట్టిని నీరు చెట్టు ద్వారా తొలగించడంతో గత నాలుగు సంవత్సరాలుగా చెరువులు, వంకలు ,వాగుల్లో నీటి నిలువలు పుష్కలంగా ఉన్నాయన్నారు. మీకు నిజంగా మానవత్వం ఉంటే మీరు చెట్టు పనులపై సమగ్ర విచారణ చేయించుకోవాల్సిందిగా వారు సవాలు విసిరారు. వైకాపా నాయకులు చేస్తున్న భూ కబ్జాలు, దందాలు , అవినీతిని ప్రజలు గమనిస్తున్నారని మీ పాపం పండే రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. వెలగల్లు ప్రాజెక్టు నుంచి మాధవరం వరకు తాగునీటి పథకం పనులు టిడిపి హయాంలో చేపట్టిన ప్రస్తుత వైకాపా ప్రభుత్వం కమీషన్లకు కక్కుర్తి పడి ఆ పథకం పనులు ఎక్కడ వేసిన పనులు అక్కడే నిలిపివేయడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు .ప్రస్తుతం వెలిగల్లు ప్రాజెక్టు కాలువలలో కంప చెట్లను సైతం తొలగించిన స్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్, చిన్నపరెడ్డి, భద్రపరాయుడు, టిడిపి నాయకులు రెడ్డప్ప రెడ్డి ,మీటేనాయక్ శ్రీకాంత్ రెడ్డి , డాక్టర్ రామచంద్రారెడ్డి నాగేశ్వరరావు ,ప్రభాకర్ రెడ్డి ,రాఘవులు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో కొమ్మలు కత్తరింపులు చేపడితే పంట దిగుబడి పెరిగే అవకాశం

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లె : ముదురు మామిడి లో కొమ్మలు కత్తరింపులు చేపడితే పంట దిగుబడి పెరిగే అవకాశం మెండుగా ఉంటుందని లక్కిరెడ్డిపల్లె ఉద్యాన శాఖ అధికారిణి టి.నాగమణి పేర్కొన్నారు.శనివారం మండలంలోని మద్దిరేవుల, కస్తురాజుగారి పల్లి గ్రామాల రైతులకు మామిడి పంటలో కాయల కోత తర్వాత ఆచరింవలసిన సస్యరక్షణ, సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడి లో కాయలు కోసినప్పటి నుండి తగు జాగ్రత్తలను పాటించినట్టైతే నాణ్యతతో కూడిన మంచి దిగుబడులు పొందవచ్చని సూచించారు. కాయలు కోసిన తర్వాత 15-20 రోజులు చెట్లకు విశ్రాంతి నిచ్చిన తర్వాత కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని సూచంచారు. గుబురుగా పెరిగిన చెట్లలో సూర్య రష్మి , గాలి లోపలికి ప్రసరించెల తలపైన కొమ్మలను, తూర్పు పడమర దిక్కులలో ఉన్న కొమ్మలను, ఎండుపుల్ల , చీడపీడలు ఆశించిన కొమ్మలు , తొడిమ కొమ్మలను, ఎండి పోయిన పూత కాడలను కత్తిరించి తొలగించాలని సూచించారు. కత్తిరింపులు చేసిన వెంటనే కోసిన కొమ్మ భాగానికి మరియు చెట్లు పూర్తిగా తడిచెల 3 గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని వివరించారు. తొలకరి వర్షాలు పడగానే వాలుకు అడ్డంగా దున్నాలి. దున్నకాలు చేపట్టడం ద్వారా వర్షపు నీరు భూమిలో ఇంకి తేమ శాతం పెంచడం జరుగుతుంది మరియు కలుపుని నివారించుకోవచ్చున్నారు. 10 సంవత్సారాలు పైబడిన చెట్లకు వర్షాధారం తోటల్లో ప్రతి చెట్టుకు 2 కిలోల యూరియా , 5 కిలోల సూపర్ ఫాస్ఫేట్ మరియు 1.5 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలి. నీటి వసతి కల్గిన తోటల్లో 1 కిలో యూరియా , 5 కిలోల సూపర్ ఫాస్ఫేట్ మరియు 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ చొప్పున వేయాలి. పిందెలు గోలీ సైజులో ఉన్నప్పుడు మిగతా 1 కిలో యూరియా 750 గ్రాముల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వేయాలని సూచించారు. ఎరువులను చెట్లకు 4-5 అడుగుల దూరంలో చేసిన గాడిలో వేసి మట్టిలో కలిపి నీరు పారించాలి. జులై లో పచ్చిరొట్టే పైర్లయిన జనుము, జిలుగా, పెసర, అలసంద, ఉలవలు, పిల్లిపెసర లాంటి పంటలు వేసి పూత దశలో కలియదున్నలని సూచించారు. జింక్, బోరాన్ ధాతువుల లోపాలను నివారించడానికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్, 2 గ్రాముల బోరాన్ లీటరు నీటికి లేదా ఫార్ములా-4 పొడిని లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి 15 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలని వివరించారు. ప్రతి మామిడి రైతు డ్రిప్ పద్ధతిని పాటించలన్నారు. ఈ కార్యక్రమం నందు రైతు భరోసా కేంద్ర సిబ్బంది లావణ్య , పరిమళ మరియు రైతులు పాల్గొన్నారు.

కిషోర్ ఆరోపణలు అవాస్తవం: వైసీపీ

విశాలాంధ్ర-పీలేరు : జగనన్న లేఅవుట్లో ఇండ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు గత 10 రోజులుగా నూనె విత్తుల కారాగారంలో అక్రమంగా కె.వి. పల్లి మండల వాసులు ఇండ్లు నిర్మించుకుంటున్నారని చెపుతూ ఆరోపిస్తున్న కిషోర్ ఆరోపణలు అవాస్తవమని జగనన్న లే అవుట్ లబ్ధిదారులు జయరామచంద్రయ్య (జయన్న),నాగభూషణం,సిద్దులయ్య, అరుంధతి, సలాంబా, సుబ్బారెడ్డి, ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు, మాజీ జడ్పీటీసీ జయరామచంద్రయ్య మాట్లాలాడుతు కిషోర్ రెడ్డి మీ ఆరోపణలు పూర్తిగా అవస్తవమని తెలిపారు .పీలేరు మండలం, గూడరేవుపల్లి పంచాయితీలో సర్వే నెం. 175, 176. 177 మరియు 198లలో ఎ.17.40 సెంట్లు భూమిని 723 మందికి ప్లాట్లు వేసి అర్హులైన వారికి ఇండ్లు మంజూరు చేశారు. మేము ఈ అర్హుల జాబితాలో సాధరణ పౌరులుగా ఇండ్లు నిర్మించుకుంటున్నాము. దీనికి రాజకీయాలు పులుముతూ పేద ప్రజలపై కక్ష కట్టి ఇండ్లు కూల్చేయండి అని అన్నారు.సాధారణ పౌరులు ఇండ్లు కట్టుకోవడం ఇష్టం లేక రోజూ పని కట్టుకొని పత్రికలకు ఎక్కుతున్నారు. దీనిపై సమగ్ర విచారణకు మేము సిద్ధం. నూనెవిత్తుల కర్మాగార విషయంలో మాజీ శాసన సభ్యులు జి.వి. చంద్రశేఖరరెడ్డి ప్రతిపాదన మేరకు అప్పటి ముఖ్యమంత్రి దివంగతనేత స్వర్గీయ నందమూరి రామారావు పీలేరును అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని నూనెవిత్తుల కార్మాగారం మంజూరు చేశారు. కాలక్రమంలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యాక యన్.టి.రామారావు కు అప్పటి శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మంచిపేరు వస్తుందని కక్షగట్టి నూనెవిత్తుల కార్మాగారాన్ని మూసివేశారు. అప్పటికో వందలమంది ఉద్యోగస్తులు మరియు ఈ ప్రాంత రైతులకు జీవనోపాధి లేకుండా. పొట్టగొట్టారు. ఆ తరువాత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు రెండు అడుగులు ముందుకువేసి నూనెవిత్తుల కార్మాగారంలో వున్న మిషనరీని తుక్కుసామాన్ల క్రింద అమ్ముకున్న చరిత్ర నల్లారి కుటుంబానికి చెందుతుందని అన్నారు. అలాంటి మీరు చరిత్ర తెలియకుండా గగ్గోలు పెడుతున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని స్థానిక శాసన సభ్యులు చింతల రామచంద్రారెడ్డి,యం.పి. పెద్దిరెడ్డి వెంకట మిధున్రెడ్డి రికార్డు స్థాయిలో ఇంటి పట్టాలు ఇప్పించారు. ఇది చూసి ఓర్వలేక మీరు అవాకులు చవాకులు పేలుస్తున్నారు. నూనెవిత్తుల కార్మాగారం స్థాపించి 40 సంవత్సరాలు కావస్తున్న ఇక్కడ పీలేరు ప్రాంత ప్రజలకు అభివృద్ధి లేకుండా చేసి మూసివేసింది చంద్రబాబు కాదా? మిషనరీని తుక్కు సామాన్లుగా అమ్ముకున్న మీరు కాదా అని ఆరోపించారు. అప్పటి నుండి ఇప్పటి వరకు నూనెవిత్తుల కార్మాగారానికి ఉచితంగా స్థలలా ఇచ్చినా రైతులు మీకు గుర్తుకు రాలేదా?ఎన్నికలు ముందుకు వస్తున్నాయి కాబట్టి వారు మీకు గుర్తుకువచ్చారా? విలేకరులు ఇండ్లు కట్టుకోవాలని ప్రయత్నం చేస్తుంటే మాజీ వి.ఆర్.పి. చంద్రశేఖర్ రెడ్డి భూమిని దౌర్జన్యంగా ఆక్రమించుకొని ఉ పాధి హామీ ఉద్యోగులు మరియు నీ అనుచరులకు 40 మందికి 6 సెంట్ల నుండి 10 సెంట్ల వరకు ఇండ్లు కట్టుకొనేందుకు సహకరించారు పురం రామూర్తి తెలుగుదేశం పార్టీ బి.సి. నాయకుడు మీ అనుచరుడు తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారి ప్రక్కన ఎర్రగుంటపల్లి పంచాయితీ సర్వే నెం.741లో 6 బినామి పట్టాలు తీసుకున్నారు. అదే జాతీ రహదారి ప్రక్కన గూడరేవుపల్లి పంచాయితీలో సర్వే నెం.202/4లో గుండ్లూరు బసవయ్య మల్లయ్యకు చెందిన సుమారు 3 ఎకరాల భూమిని టిడిపి నాయకుడు పోలిశెట్టి సురేంద్ర, బాజ్జీరెడ్డి ఆక్రమించుకొని డూప్లెక్స్ ఇల్లు కట్టుకున్నారు. అవి మీ కంటికి కనపడలేదా? మీరు ఇదివరకే పత్రికలకు ఎక్కి హైకోర్టు, లోకాయుక్తాకు పోతామని ముడుపులు తీసుకున్నావని మేము ఎక్కడైనా ప్రమాణం చేస్తాము. మీరు ఎక్కడైనా ప్రమాణం చేస్తారా ? కమీషన్ తీసుకొనే అలవాటు మీకు వుంది. మా యం.పి., యం.యల్.ఎ. లు కమీషన్ తీసుకొనే అలవాటు లేదని పేర్కొన్నారు.